

ఎయిర్‌పోర్టులపై సమీక్షిస్తున్న చంద్రబాబు నాయుడు

ఒంగోలులో ఎయిర్‌పోర్టుపై అధ్యయనాన్ని పూర్తి చేయాలి

అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

ఒంగోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సమీపంలో ప్రతిపాదించిన ఎయిర్ పోర్టు సాధ్యాసాధ్యాలపై చేపట్టిన అధ్యయనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు ఎయిర్ పోర్టులు ఉండగా మరో ఏడు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. ఉన్న ఎయిర్ పోర్టులలో అభివృద్ధి చేయాల్సిన అంశాలు, కొత్తగా ప్రతిపాదించిన వాటి ప్రస్తుత పరిస్థితిని అధికారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఒంగోలు ఎయిర్‌పోర్టు అంశంపై సమీక్షలో 657 ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ ఎయిర్ పోర్టు ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం జరుగుతున్నట్లు చెప్పారు. దానిపై స్పందించిన సీఎం చంద్రబాబు త్వరితగతిన దాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



కనిగిరిలో పోటీలకు సిద్ధమైన అమరావతి గ్రౌండ్స్

నేడే ముగ్గుల పోటీలు

ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఒంగోలు, కనిగిరిలో నిర్వహణ

ఒంగోలు(కల్చరల్)/కనిగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలు శనివారం ప్రారంభమవుతున్నాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఒంగోలు, కనిగిరిల్లో జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు..గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో ఈ రెండు కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ఒంగోలులో ఆర్టీసీ బస్టాండుకు సమీపంలో ఉన్న పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాల, కనిగిరిలో పామూరు రోడ్డులో ఉన్న అమరావతి గ్రౌండ్స్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒంగోలులో జరిగే పోటీలకు శ్రీసరస్వతి విద్యాసంస్థలు, కనిగిరిలో జరిగే పోటీలకు అమరావతి ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ (గుంటూరు), ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి లోకల్ స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తారు. ఒంగోలులో విజేతలకు ప్రథమ బహుమతిగా ఎల్ఈడీ టీవీ, రెండో బహుమతిగా వాషింగ్ మెషీన్, మూడో బహుమతిగా ట్రావెలింగ్ లగ్జరీ సూట్‌కేస్, 10 మందికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. కనిగిరిలో ప్రథమ బహుమతి కింద రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందజేస్తారు. వాటితోపాటు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి.

నాటి భూ బాగోతాలపై నిగ్గు తేల్చండి

బాధితులకు న్యాయం చేయండి
రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక సమావేశంలోఎమ్మెల్యేల విజ్ఞప్తి
మార్చి నాటికి పరిష్కరించాలని మంత్రి సత్యప్రసాద్ ఆదేశం

ఉమ్మడి జిల్లాలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూదందాలు, ఆక్రమణలపై నిగ్గు తేల్చి బాధితులకు న్యాయం చేయాలని టీడీపీ శాసనసభ్యులు, ఇన్‌చార్జిలు కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మంగళగిరిలో రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు పలు అంశాలను ప్రస్తావించారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా నుంచి కలెక్టర్, జేసీ, టీడీపీ శాసనసభ్యులతో పాటు ఇద్దరు ఇన్‌చార్జిలు హాజరయ్యారు. గత ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణలపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేలు కోరారు.
- ఆంధ్రజ్యోతి, ఒంగోలు



సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రజాప్రతినిధులు (ఇన్‌సెట్లో) రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్

రేగులచెలకలో 400 ఎకరాలు ఆక్రమణ

తొలుత కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో జరిగిన అనేక భూ ఆక్రమణల గురించి సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సీఎస్‌పురం మండలం రేగులచెలక గ్రామంలో 400 ఎకరాల భూ ఆక్రమణ జరిగితే దానిపై గత ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ చేయించకపోగా సీఎస్‌పురంలోని మొత్తం భూములపై నిషేధం విధించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హెచ్‌ఎంపాడు మండలం టీపీపల్లి, అగ్రహారం, హెచ్‌ఎంపాడు ప్రాంతాల్లో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ ప్రభుత్వంలో పంపిణీ చేయగా 1,500 ఎకరాలను నియోజకవర్గేతరులకు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై విచారణ చేయించాలని కోరారు. వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాల్లో రెవెన్యూ సమస్యలను ప్రస్తావిస్తే మా వద్ద రికార్డులు లేవంటూ అధికారులు తప్పుకుంటున్నారని.. విచారణ చేయించి అసలు అవి ఉన్నాయో, లేవో తేల్చాలని కోరారు.

ఆన్‌లైన్ ప్రక్రియను ఆర్డీవో పరిధిలోకి తేవాలి

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మార్కాపురం ప్రాంతంలో జరిగిన భూ ఆక్రమణలకు సంబంధించి 35 రికార్డులపై విచారణ చేయించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అప్పట్లో ప్రభుత్వం అధికారులను బలి చేస్తూ అనేక మందిని సస్పెండ్ చేసిందే తప్ప ఆక్రమణలకు పాల్పడిన వారి నుంచి భూములు వెనక్కు తీసుకోలేదన్నారు. ఆ భూబాగోతాలపై తిరిగి విచారణ చేయించాలని కోరారు. భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలన్నా, తొలగించాలన్నా అధికారం జాయింట్ కలెక్టర్ల పరిధిలో ఉండటంతో ఇబ్బందులు కలుగుతున్నాయన్న ఆయన.. ఆర్డీవో పరిధిలోకి తేవాలని కోరారు.

ఒంగోలులో ఇళ్ల స్థలాల కేటాయింపులోనూ అక్రమాలే

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒంగోలులో జరిగిన అనేక అక్రమాలపై తిరిగి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అప్పట్లో నిరుపేదలకు ఇంటి స్థలాల కేటాయింపులోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. అనర్హులకు స్థలాలను కట్టబెట్టారని, ప్రత్యేక విచారణ చేయించి న్యాయం చేయాలని కోరారు.

● సమావేశంలో పాల్గొన్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆ రెండు నియోజకవర్గాల్లో ఉన్న ఇనాం భూముల సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా

మిగతా 6లో...

డ్వామాలో విచారణ వేగవంతం

ఈనెల 8, 9 తేదీల్లో త్రిసభ్య కమిటీ ఎదుట హాజరుకావాలని 35 మందికి నోటీసులు



డ్వామా కార్యాలయం

ఒంగోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : డ్వామా పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అవకతవకలపై విచారణను త్రిసభ్యకమిటీ మరింత వేగవంతం చేసింది. ఇప్పటి వరకు ఆరోపణలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించడంతోపాటు పూర్వపు పీడీ శీనారెడ్డిని కమిటీ విచారించింది. తాజాగా ఫిర్యాదు చేసిన వారితోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు సిబ్బంది, ఆయా అంశాలతో సంబంధం ఉండే సంస్థ ఉద్యోగులను కూడా వ్యక్తిగతంగా విచారించాలని నిర్ణయించింది. ఈనెల 8,9 తేదీల్లో విచారణ చేపట్టాలని భావించిన కమిటీ అందుకు సంబంధించి 35 మందికి నోటీసులు జారీ చేసింది. కమిటీ ఛైర్మన్ అయిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు శుక్రవారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీచేశారు. అందులో నలుగురు ఫిర్యాదుదారులు కాగా, మిగిలిన 31 మంది డ్వామా ఉద్యోగులు. దాదాపు పక్షం రోజులుగా

మిగతా 6లో...



రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులతో డీఈవో కిరణ్‌కుమార్

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

రాష్ట్రస్థాయికి ఆరు ప్రాజెక్టులు ఎంపిక

ఒంగోలు విద్య, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానిక ఒంగోలు పబ్లిక్ స్కూలులో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ

మిగతా 6లో...



ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న సిబ్బంది

6న ఓటర్ల తుది జాబితా

నియోజకవర్గాలకు తరలింపు కోసం ఏర్పాట్లు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 6వతేదీన ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్నారు. అందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. నాలుగు నెలల క్రితం ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల కమిషన్ ఆదేశించింది. తదనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను చేపట్టారు. చేర్పులు, మార్పులు చేశారు. ఈనెల 6వతేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయ ఆవరణలో ఆయా నియోజకవర్గాల సిబ్బంది జాబితాలను తమ ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు పరిశీలన చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక వాహనాల్లో నియోజకవర్గాలకు తరలించనున్నారు. ఆర్వో తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

స..రి..గ..మ..ప..ద..ని..

- పగలు సంగీత శిక్షణ, రాత్రివేళ భిక్షాటన
- వాగ్గేయ కారుడు త్యాగయ్య స్ఫూర్తితో ఈశ్వరయ్య
- కంభంలో 35 ఏళ్లుగా నిర్వహణ
- రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు రాక

7

గ్రానైట్ వాహనాలు సీజ్

చీమకుర్తి, జనవరి3(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం పరిసరప్రాంతాల్లో ఉన్న గ్రానైట్ క్వారీల నుంచి బిల్లులు లేకుండా ముడిరాళ్లను రవాణా చేస్తున్న మూడు లారీలను శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. ముడిరాయిని ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా చీమకుర్తి బైపాస్ ప్రాంతంలో అధికారులు దాడులు నిర్వహించారు. వీటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాళ్లను బట్టి జరిమానా విధించనున్నారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టులో జిల్లా క్రీడాకారులు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాలీబాల్ జట్టులో జిల్లాకు చెందిన క్రీడాకారులు స్థానం దక్కించుకున్నారు. అడహక్ కమిటీ వాలీబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి సీనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటున్నట్లు అసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సూదనగుంట కోటేశ్వరరావు, మండువ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ క్రీడలో ప్రతిభ చాటిన బి.హేమంత్, ఎం.ఈశ్వర్, బి.శ్యామ్, ఎం.నాగలక్ష్మీలు రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకోవడం సంతోషంగా ఉందని, రాష్ట్ర జట్టులో ఒకే సారి నలుగురు ఎంపిక కావడం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే మొదటి సారి అని పేర్కొన్నారు. అలాగే వీరికి శిక్షణ అందించిన కోచ్ జి.రాధాకృష్ణను అభినందించారు.

9 నుంచి కేవీపాలెంలో క్రికెట్ పోటీలు

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు జరుగుతాయని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలలో విజేతలకు మెదటి బహుమతిగా రూ.25,116, రెండో బహుమతిగా రూ. 20,116, మూడో బహుమతిగా రూ.15,116 అందజేస్తామని, మ్యాన్ అఫ్‌ది సిరీ్‌ఎకు రూ.3,116 చొప్పున అందజేస్తామని, ఎంట్రీ ఫీజు రూ.750 చెల్లించాలని కోరారు. ఈనెల 8 వ తేదీన పోటీలకు సంబంధించి డ్రా తీస్తామని, మరిన్ని వివరాలకు 8555834197, 7670949842 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ కుటుంబానికి సాయం

చినగంజాం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ గుండెపోటుతో మృతిచెందిన ఆసోది నరేంద్రబాబు కుటుంబాన్ని శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖాధికారి రాజ దెబోరా పరామర్శించారు. జిల్లా పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌లు అందజేసిన ఆర్థిక సాయం రూ.64,400లను ఆమె నరేంద్రబాబు కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుబ్బారావు, చీరాల, రేపల్లె ఏఎ్‌ఎడబ్ల్యూవోలు సైదారెడ్డి, సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యూవో, వెల్ఫేర్ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, చినగంజాం, పలు మండలాలకు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అంధులు అన్ని రంగాల్లో రాణించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా
● బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆటల పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అంధులు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. లూయిస్‌బ్రెయిలీ జయంతి సందర్భంగా ఒంగోలులోని డీఆర్ఆర్ఎం స్కూలులో శుక్రవారం నిర్వహించిన క్రీడాపోటీలలో అంధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంధులు తమకు వైకల్యం ఉందని నిరాశ చెందకుండా, ఆత్మవిశ్వాసంతో అన్నింటా రాణించాలని చెప్పారు. బ్రెయిలీ రూపొందించిన లిపి నేడు అనేక మందికి వరంగా మారిందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణిస్తూ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తున్న వారు భవిష్యత్‌లో మరింతగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల డీడీ జి.అర్చన, జడ్పీ సీఈవో చిరంజీవి, మెప్మా, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అంజల పాల్గొన్నారు.


ఆటల పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్ అన్సారియా, అధికారులు అర్చన, అంజల, రవికుమార్, అర్జున్‌నాయక్

ఉపాధ్యాయురాలిపై అధికారి దురుసుతనం

● ప్రశ్నించారని పంతుళ్ల మధ్యలో కూర్చోబెట్టిన శిక్షణాధికారి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే పంతులమ్మలపై శిక్షణ తరతుల్లో ఓ అధికారి దురుసుగా ప్రవర్తించారు. ఒంగోలులో శుక్రవారం ఈ ఘటన జరిగింది. 1, 2 తరగతుల విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు 60 రోజుల సర్టిఫికెట్ కోర్స్ శుక్రవారం నుంచి మొదలైంది. ఈనెల 8వ తేదీ వరకు స్థానిక మంగమూరు రోడ్డులోని రామచంద్ర మిషన్ ఆశ్రమంలో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయి. తొలిరోజు జిల్లా నలుమూలల నుంచి 180 మంది ఉపాధ్యాయులను ఆహ్వానించారు. 100 మంది వరకు మహిళా ఉపాధ్యాయులు వచ్చారు. 80 మంది పురుష ఉపాధ్యాయులున్నారు. శిక్షణ ఇచ్చే సమయంలో మహిళా ఉపాధ్యాయులు, పురుష ఉపాధ్యాయులు వేరువేరుగా కూర్చున్నారు. అయితే మహిళా ఉపాధ్యాయులు మాట్లాడుకుంటున్నారని ఆ శిక్షణకు నాయకత్వం వహించే ఒక అధికారి వారిపై దురుసుగా ప్రవర్తించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లను ఒకరిపక్కన ఒకరు కూర్చోవాలని ఆదేశించారు. దీంతో మహిళా ఉపాధ్యాయురాలు ఆయన్ను ప్రశ్నించారు. పురుష ఉపాధ్యాయుల పక్కన కూర్చొనేందుకు నిరాకరించారు. కోపోద్రిక్తుడైన అధికారి వెంటనే ఒక బెంచిపై ఆ మహిళా ఉపాధ్యాయురాలిని మధ్యలో కూర్చోబెట్టి ఇరువైపులా పురుషులను కూర్చోబెట్టారు. ఉన్నత చదువు చదువుకొని ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘకాలంపాటు పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిపట్ల అధికారి వ్యవహరించిన తీరుపై మిగిలిన టీచర్లు మండిపడ్డారు. జిల్లా ఉన్నతాధికారులు ఆ అధికారిని తొలగించి ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు మరో అధికారిని నియమించాలని కోరారు.

వైసీపీ హయాంలోని భూకుంభకోణాలపై విచారణ చేయాలి

● రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో కోరిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన నకిలీ పట్టాలు, భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు. శుక్రవారం మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్‌ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల ప్రాంతీయ రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఒంగోలులో జరిగిన భూ కుంభకోణంపై ఏర్పాటు చేసిన సిట్ రిపోర్టు గురించి ప్రస్తావించగా, రెవెన్యూ మంత్రి, ఆర్‌పీ సిసోడియాలు దీనిపై కలెక్టర్‌ను పూర్తి రిపోర్టు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్‌పై ఫోరెన్సిక్ రిపోర్టు, అలాగే సుజాతనగర్‌లోని ఎండోమెంట్ భూముల గురించి ప్రస్తావించిన దామచర్ల, నివాసితులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన సంబంధిత శాఖ మంత్రులు తగిన వివరాలు అందజేయాలని సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులను కోరారు.

మేము సైతం..!


మహిళా అభ్యర్థులకు నిబంధనలు చెబుతున్న ఎస్పీ దామోదర్

● కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియకు మహిళా అభ్యర్థులు
● రాత పరీక్షకు 123 మంది అర్హత

ఒంగోలు(క్రైం), జనవరి3 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలకు మేము సైతం అంటూ మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల పెరేడ్ మైదానం శుక్రవారం కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షల కోసం 455 మంది మహిళ అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 194 మంది పాల్గొన్నారు. రన్నింగ్, హైజంప్ తదితర పరీక్షల అనంతరం 123మంది రాత పరీక్షలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియలో పాల్గొనే వారు ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు ఉంటే తెలియజేయాలని కోరారు. అదేవిధంగా దళారుల మాటలు నమ్మవద్దని హితవు పలికారు. కేవలం సామర్థ్యం, ప్రతిభ ఆధారంగా కానిస్టేబుల్ ఉద్యోగం వస్తుందని చెప్పారు. కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియను ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు పర్యవేక్షించారు.


ధ్రువీకరణ పత్రాలను చెక్ చేయించుకుంటున్న అభ్యర్థులు


దూకేశా.. అర్హత పట్టేశా...


అర్హతకు అందినంత ఎత్తులో...

బీసీ కార్పొరేషన్ రుణాలకు 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ

మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు అవకాశం
ఐదేళ్ల తర్వాత మంజూరు కానున్న రుణాలు

ఒంగోలు నగరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ మళ్లీ కళకళలాడుతోంది. ఐదేళ్ల తర్వాత లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. తొలుత బ్యాంకు లింకేజితో సబ్సిడీ రుణాలను వివిధ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. సబ్సిడీ రుణాల కోసం జిల్లాలోని బీసీలు ఈ నెల 8వ తేదీ నుంచే దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించుకునేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. వీటితో పాటు రూ.8 లక్షల యూనిట్ విలువతో జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించారు. 16వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తారు. గత ఐదేళ్లుగా రూపాయి కూడా వైసీపీ ప్రభుత్వం బీసీలకు రుణాలను మంజూరు చేయలేదు. పైగా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన రుణాలను లబ్ధిదారుల మెడపై కత్తి పెట్టి మరీ వసూలు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి కార్పొరేషన్లకు పూర్వవైభవం రానుంది. జిల్లాలోని 1195 మందికి వివిధ రకాలైన స్వయం ఉపాధి యూనిట్లు, 24 మంది బీ ఫార్మసీ చేసిన నిరుద్యోగులకు జనరిక్ మందులు దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందజేయనున్నారు. రుణాలను విడుదల చేసి ఫిబ్రవరిలో యూనిట్లను ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. గొర్రెల పెంపకం, మినీ డెయిరీ, మోడ్రన్ పవర్ లాండ్రీ, ఆటో, టాటా ఏస్, వెదురు బుట్టల తయారీ, సెల్ ఫోన్ రిపేర్ వంటి 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేయనున్నారు.

అవీఇవీ

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన పెన్షన్‌దారులు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్లు, నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లు అందజేయాలని జిల్లా ఖజానా, లెక్కలశాఖ అధికారి ఎ.జగన్నాథరావు ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ఒంగోలు, పొదిలి, దర్శి, కనిగిరి, కంభం, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం సబ్ ట్రెజరీల పరిధిలో సర్వీసు పింఛన్లు డ్రా చేస్తున్న పెన్షన్‌దారులందరూ ఆయా సర్టిఫికెట్లను అందజేయాలన్నారు. పెన్షన్‌దారులు సర్టిఫికెట్లను అందించేందుకు ప్రభుత్వం డిజిటల్ ఏపీసీల విధానాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. జిల్లాలోని సహాయ ఖజానాధికారులు, ఉప ఖజానాధికారులు తమపరిధిలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు వచ్చిన పెన్షనదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షనదారులు వారు నివాసం ఉండే ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నెట్‌సెంటర్లు, పోస్టాఫీసు, మీసేవా కేంద్రాల ద్వారా ఏపీసీ ఫారాలను సమర్పించవచ్చని ఆయన తెలిపారు.

నిగ్గు తేల్చండి

(5వ పేజీ తరువాయి)

ఎనిమిది గ్రామాల పరిధిలో ఉన్న సమస్యలను వివరిస్తూ తక్షణమే రైతులకు రిజిస్ట్రేషన్‌లు జరిగేలే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పూర్తి హక్కులు ఉన్నప్పటికీ దేవదాయ భూముల పేరుతో ప్రైవేట్ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపారని చెప్పారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వాన్‌పిక్ పేరుతో ఆ పరిధిలో లేని భూములపై రైతుల హక్కులు ఆపేశారని వాటిని పునరుద్ధరించాలని కోరారు. మరో మంత్రి స్వామి విశాఖ పర్యటనలో ఉన్నందున సమావేశానికి హాజరుకాలేదు. దీంతో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ సత్య కొండపి నియోజకవర్గంలోని పలు రెవెన్యూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తోపాటు దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు వారి నియోజకవర్గాల్లోని సమస్యలను వివరించారు. వీటన్నింటినీ వచ్చే మార్చిలోపు పరిష్కరించాలని, మార్చి చివర్లో ఇదే తరహా సమావేశం నిర్వహిస్తామని మంత్రి సత్యప్రసాద్ రాష్ట్ర, జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

డ్వామాలో విచారణ వేగవంతం

(5వ పేజీ తరువాయి)

లోకేశ్వరరావు నేతృత్వంలోని కమిటీ విచారణ చేస్తుండగా అనేక అంశాలు వెలుగు చేస్తున్నాయి. అదే సమయంలో ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. కమిటీ ఫైళ్ల పరిశీలనలో పలువురు ఉద్యోగుల భాగస్వామ్యం కూడా అవకతవకలు, అక్రమాల్లో ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. అలాగే కొందరు ఉద్యోగుల పేర్లు కూడా ఫిర్యాదుదారులు ఇచ్చిన వాటిలో ఉన్నాయి. మరోవైపు శీనారెడ్డిపై ఆరోపణలు అధికంగా ఉన్న విభాగాలలో పనిచేసే సిబ్బంది తీరుపైనా అనుమానాలను కమిటీ సభ్యులు వ్యక్తం చేస్తూ ప్రస్తుత పీడీ జోసఫ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇక నిబంధనలకు విరుద్ధంగా తొలుత శీనారెడ్డి కార్యాలయానికి వెళ్లి తనకు పరిచయం ఉన్న ఉద్యోగుల నుంచి కొన్ని ఫైళ్ల నకళ్లను తీసుకెళ్లిన నేపథ్యంలో ఫైళ్ల ట్యాంపరింగ్ కూడా జరుగుతుందేమోనన్న అనుమానాలను కొందరు ఫిర్యాదుదారులు కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

పీడీ జోసఫ్‌కుమార్ అప్రమత్తం

తాజా పరిణాల మనేపథ్యంలో ప్రస్తుత డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ కూడా అప్రమత్తమై పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కమిటీ సభ్యుల సూచన మేరకు ఫిర్యాదులకు సంబంధించిన ఫైళ్లు చూసే విభాగాలకు వారం క్రితం నోటీసులు ఇచ్చారు. ఒక కీలకమైన ఉద్యోగి సెలవు పెట్టడంతో అతని వద్ద ఉండే ఫైళ్లను మరొకరికి అప్పగించాలని ఆదేశించారు. పూర్వ ఉద్యోగులు.. ప్రత్యేకించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కార్యాలయంలో ఫైళ్లను నిబంధనలకు విరుద్ధంగా పరిశీలించకుండా కార్యాలయంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. మొత్తం పరిణామాలను కలెక్టర్ అన్సారియా దృష్టికి తీసుకెళ్లి మౌఖికంగా అనుమతి కూడా పొందినట్లు తెలిసింది. కాగా 35 మందిని వ్యక్తిగతంగా విచారణ చేయాలని భావించిన లోకేశ్వరరావు కమిటీ ఫిర్యాదులు చేసిన నలుగురిని ఈనెల 8న, 31 మంది డ్వామా ప్రస్తుత, పూర్వపు ఉద్యోగులను 9వతేదీన ఇక్కడి డ్వామా కార్యాలయంలో హాజరైన రాతపూర్వకంగా వివరణలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నోటీసులు జారీ చేసింది.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

(5వపేజీ తరువాయి)

సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రం పట్ల అభిలాషను పెంచాలన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించి వారి ఉన్నతికి ఉపాధ్యాయులు మార్గదర్శకులు కావాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించిన డీఈవో వారిని అభినందించారు. 38 మండలాల నుంచి మండలానికి మూడు చొప్పున 114 ప్రాజెక్టులు రావాల్సి ఉండగా 87 మాత్రమే ప్రదర్శించారు. మండల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులు జిల్లా స్థాయిప్రదర్శనకు తీసుకురాని వారికి, మండల స్థాయిలో అసలు ప్రదర్శనలను నిర్వహించని వారికి మెమోలు జారీ చేస్తున్నట్లు డీఈవో తెలిపారు. ప్రదర్శనలో ఆరు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 18 మందికి డీఈవో సర్టిఫికెట్లను అందజేశారు.

విజేతలు వీరే

వ్యక్తిగత, సామూహిక, టీచర్ ఎగ్జిబిట్లలో ఆరింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వ్యక్తిగత విభాగంలో మంగమూరు జడ్పీ హైస్కూలు విద్యార్థి పి.దివ్యశ్రీ (లిజునిలన్ మెషిన్), మార్కాపురం జడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థి శ్రీలక్ష్మి కామేశ్వరి (స్మార్ట్ పోల్), గ్రూపు ఎగ్జిబిట్‌లో చిన్నారికట్ల విద్యార్థులు ఎం.సాయి, బి.వీరేంద్ర (పెన్షింగ్ ఆఫ్ హ్యూమనిటి), తమ్ములచెరువు హైస్కూలు విద్యార్థులు ఈశ్వరరెడ్డి, ఎం.శ్రీను(సోలార్‌షిప్) ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. టీచర్ ఎగ్జిబిట్‌లో పొదిలి జీహెచ్ఎస్ టీచర్ ఎ.మధుసూదనరావు (స్మార్ట్ ప్యాన్ మైక్రోస్కోప్), ఈదుమూడి హైస్కూలు టీచర్ కె.స్వర్ణలత (జాబిల్లి జిలుగులు) ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. వ్యక్తిగత విభాగంలో ద్వితీయ స్థానంలో ఇద్దరు, తృతీయ స్థానంలో ఇద్దరిని విజేతలుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు సైన్స్ అధికారి టి.రమేష్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పంగులూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని భగవాన్‌రాజుపాలెం ఫ్లై ఓవర్ దిగువన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు అందించిన సమాచారం మేరకు ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న మారుతీ జన్ కారు ముందు వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదే వరుసలో ముందు వెళుతున్న ఆటోతో పాటు స్కూటర్‌ను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న బొమ్మనంపాడు గ్రామానికి చెందిన కస్తూరి నాగేశ్వరరావు కారు టైరు కిందపడి మృతిచెందాడు. కారు వేగంగా ఢీకొనడంతో ఆటో తిరగబడటంతో అందులో పంగులూరు నుంచి మార్టూరు కూరగాయల మార్కెట్‌కి వెళుతున్న పొన్నం శ్రీనివాసరావుకు కాలు విరిగింది. బేతాల పెదేడుకొండలు, నందవరపు పీరు సాహెబ్, పెదమస్తాన్, శ్రావణం మస్తానమ్మలకు గాయాలయ్యాయి. ఎస్ఐ వినోద్‌బాబు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మార్టూరుకు,కాలు విరిగిన శ్రీనివాసరావును నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. నాగేశ్వరరావు (70) మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేణంగివరం ఎస్ఐ. వినోద్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

చీరాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి రాజమండ్రి జిల్లా సీతానగరం మండలం బొబ్బర్లంకకు చెందిన తన్నీరు శ్రీనివాసరావు(54) దుర్మరణం చెందాడు. చినగంజాం మండలం కడవకుదురు వద్ద గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. చీరాల రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని శుక్రవారం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

మేదరమెట్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో అత్యవసర రన్‌వేపై మోపెడ్‌పై వెళ్తున్న యువకుడిని కారు ఢీ కొంది.ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం జె. పంగులూరు మండలం రేణింగివరంకు చెందిన అన్నపురెడ్డి హరికృష్ణ (29) మోపెడ్‌పై రేణంగివరం వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో హరికృష్ణ మృతి చెందాడు. మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు పై నుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొమ్మినేనివారిపాలెం అద్దంకి మేజర్ కాలువ బ్రిడ్జి వద్ద బైకు అదుపు తప్పి పడిపోయింది. ఈప్రమాదంలో శంకరవరప్పాడుకు చెందిన హనుమంతురావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. అద్దంకి మండలం శంకవరప్పాడుకు చెందిన హనుమంతురావు బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెంకు శుక్రవారం బైకుపై వస్తుండగా అద్దంకి మేజర్ కాలవ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి బైకు అదుపు తప్పి పడింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హనుమంతురావును 108లో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

వేటపాలెం(చీరాల), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును శుక్రవారం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పట్టుకున్నారు. ఆ ట్రాక్టరును ఇసుకతో సహా స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేదలకు ఇచ్చిన నివేశన స్థలాల్లో పొజిషన్ చూపాలి

- ఇళ్ల నిర్మాణాల కోసం రూ.5లక్షలు ఇవ్వాలి
- సీపీఐ నాయకుల డిమాండ్

ఒంగోలు(రూరల్), జనవరి3(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలోని ఎస్.అగ్రహారం గ్రామం వద్ద పేదలకు ఇచ్చిన నివేశ స్థలాల్లో పొజిషన్ చూపించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్.అగ్రహారం వద్ద గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన నివేశన స్థలాల వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 22వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇచ్చిందని, అయితే లబ్ధిదారులకు పొజిషన్ చూపించలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి మార్పులు లేకుండా లబ్ధిదారులకు పొజిషన్ చూపించాలన్నారు. అనర్హులు ఉంటే తొలగించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం పైలెట్‌ప్రాజెక్ట్‌గా తీసుకొని ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ స్థలాల సమస్య పరిష్కరించ కుంటే ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ వద్ద లబ్ధిదారులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, నలూరి మురళి, ఆర్.రామకృష్ణ, నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు, ఎం.సలార్, ఉప్పుటూరి ప్రకాశరావు, కరవది సుబ్బారావు, ఎం.వెంకయ్య, ముత్తన అంజయ్య పాల్గొన్నారు.


నివేశన స్థలాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి సత్య వినతి

కొండపి, జనవరి3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలో మూడు జిల్లాల స్థాయిలో ఏపీ రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అధికారులు, ప్రజా ప్రతినిధుల సభలో కొండపి నియోజకవర్గం తరుపున సత్య పాల్గొన్నారు. ఈ సందృంగా సత్య నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను రెవెన్యూమంత్రి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా సింగరాయకొండ మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దాదాపు 2వేల ఎకరాలకుపైగా ఉన్న ఈనాం భూములుపై 20014-19 మధ్య కాలంలో ప్రభుత్వం క్రయవిక్రయాలపై నిషేధం విధించడంతో వాటి యజమానులు కుటుంబ అవసరాలకు అమ్ముకోలేని దుస్థితి ఏర్పడిందని, నిషేధం తొలగించి క్రయ విక్రయాలకు మార్గం సుగమం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ టచ్చారు.

వాలీబాల్ జట్టుకు రైజ్ విద్యార్థిని ఎంపిక

ఒంగోలు విద్య, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలోని జెప్పియార్ యూనివర్శిటీలో జరగనున్న మహిళా వాలీబాల్ పోటీలకు జేఎన్‌టీయూకే యూనివర్శిటీ తరుపున ఆడే 12మంది టీంలో ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూపునకు చెందిన విద్యార్థిని ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఈ ద్వితీయ సంవత్సరం దేవూరి శ్రీవిద్య ఈనెల 7నుంచి 11వతేదీ వరకు చెన్నైలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ మహిళా వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. కాగా పోటీలకు ఎంపికైన శ్రీవిద్యను శుక్రవారం స్థానిక కళాశాలలో సెక్రటరీ శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ.భాస్కరావు, ఇస్కాల చిన రంగమన్నార్, శిద్దా ప్రవల్లిక, ఫిజికల్ డైరెక్టర్లు హిమచంద్రబాబు, సుబ్బారావు అభినందించారు.

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖకు ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ కమిషనర్ వాకాటి కరుణ ఆదేశించారు. శుక్రవారం వైద్యాధికారులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాల లక్ష్యాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యశాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో భగీరధి, పద్మజ, వాణిశ్రీ, నళిని, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ చేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి

కొండపి, జనవరి3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో మండలంలోని గ్రామాల్లో జరిగిన పనుల పరిశీలనను పారదర్శకంగా నిర్వహించాలని ఒంగోలు డివిజన్ ఏపీడీ వెంకటస్వామి అధికారులకు సూచించారు. శుక్రవారం కొండపిలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ బృందం కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఆర్‌పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో పనులను పర్యవేక్షణ చేసిన క్షేత్రసహాయకులు గ్రామాల్లో సామాజిక తనిఖీ అధికారులకు దగ్గర ఉంచి వారు అడిగిన వివరాలను అందించాలని తెలిపారు. గ్రామాల్లో తనిఖీ బృందం మొత్తం 25కుపైగా అంశాలను పరిశీలించి నివేదిక తయారు చేయాల్సి ఉంటుందన్నారు. పది మంది డీఆర్పీలు, 20 మంది విలేజ్ సోషల్ ఆడిటర్‌లు పరిశీలన, తనిఖీల్లో పాల్గొంటారన్నారు. సమావేశంలో ఎంపీడీవో రామాంజనేయులు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మహాలక్ష్మి, పీఆర్ ఏఈ బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతో మెరుగైన వైద్యసేవలు

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉద్యోగులు తమ వంతు సహకారాన్ని అందించాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఏపీ మెడికల్ అండ్ హెల్త్ మినిస్ట్రీల సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కార్యాలయంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అసోసియేషన్ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పయ్యావుల శ్రీనివాసులు, ప్రకాష్, కమిటీ జిల్లా గౌరవాధ్యక్షుడు కూచిపూడి శరత్‌బాబు, జిల్లా అధ్యక్షుడు నారపుశెట్టి రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి విప్పల కిరణ్‌కుమార్, బాబురావు, ప్రభుదాస్, శైలజ, అంజలికుమారి, శ్రీదేవి, చైతన్య, నగేష్, ప్రదీప్, ఈశ్వరరావు, రామకృష్ణారెడ్డి, సత్యం పాల్గొన్నారు.

నేటి యువతరానికి మార్గదర్శి అంజయ్య



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మద్దిపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నేటి యువతరానికి మార్గదర్శి దివంగత కమ్యూనిస్టు నాయకుడు నల్లూరి అంజయ్య అని ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య కొనియాడారు. గురువారం రాత్రి మారెళ్లగుంటపాలెంలోని నల్లూరి అంజయ్య స్థూపం వద్ద ఏర్పాటు చేసిన శతజయంతి వేడుకల సభకు పావులూరి అంజయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బెనారస్‌లో చదువుతున్న సమయంలో అంజయ్య కమ్యూనిజం వైపు ఆకర్షితులయ్యారని, తన స్వగ్రామానికి వచ్చి యువజన సంఘం స్థాపించారని చెప్పారు. అదేవిధంగా గ్రామ అభ్యుదయం, తాగునీటి కోసం, వెచ్చిమానిక కూలీకి వ్యతిరేకంగా పోరాటాలు చేసిన వ్యక్తి నల్లూరి అంజయ్య కొనయాడారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ అంజయ్య ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు. జిల్లా ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ నల్లూరి అంజయ్య సమాజం కోసం జీవించారని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిజం మాస పత్రిక పూర్వ సంపాదకులు ఎంసీ వెంకటేశ్వర్లు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి వి.హనుమారెడ్డి, మాజీ సర్పంచ్ బుచ్చియ్యచౌదరి, సరోజ్ ఫౌండేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

బాలల బంగారు భవిష్యత్‌పై దృష్టి సారించాలి

ఒంగోలు(రూరల్), జనవరి3(ఆంధ్రజ్యోతి): బాలల బంగారుబాల్యంపై తల్లితండ్రులు దృష్టిపెట్టాలని ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య పేర్కొన్నారు. ఒంగోలు మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఈమేరకు గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా మండవవారిపాలెంలో జరిగిన సదస్సులో ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య మాట్లాడుతూ బాలబాలికలు బడికే పరిమితం కావాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నకుటుంబాలు తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని చెప్పారు. చిన్నవయస్సులో బాలికలకు వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమన్నారు. బాలికల భవిష్యత్ బంగారు బాటలు వేయటానికి తల్లితండ్రులు ముందు ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సెక్రటరీ పన్నులు వసూలు చేయాలి

● కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఆస్తి, నీటి, ప్రకటనల పన్నులను ప్రతి సెక్రటరీ వసూలు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సచివాలయ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్నులు నూరు శాతం వసూలు చేయాలన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలని చెప్పారు. గతంలో పన్నుల వసూళ్ల బాధ్యతలు రెవెన్యూ సెక్షన్, సచివాలయ అడ్మిన్‌లు మాత్రమే బాధ్యత వహించారని, ఇకపై ప్రతి సెక్రటరీ కష్టపడి పనిచేయాలని సూచించారు. నగర అభివృద్ధి కోసం అవసరమైన నిధులు సమష్టిగా కష్టపడి ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలన్నారు. గడిచిన ఐదేళ్లలో ఎన్ని అస్సెస్‌మెంట్‌లు ఉన్నాయి, ప్రస్తుతం ఎన్ని పెరిగాయో పరిశీలించాలన్నారు. అలసత్వం వీడి ఈ రెండు నెలలు కష్టపడి మార్చి 31 నాటికి లక్ష్యాలు సాధించాలని ఆయన కోరారు. సమావేశంలో ఏసీపీ సుధాకర్, ఆర్వో భాస్కర్, ఆర్ఐలు బి.కళ్యాణి, కె.క్రాంతి, శంకరశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ ఆధునీకరణ

ఒంగోలు(రూరల్): నగరంలోని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌ను ఆధునీకరిస్తామని కమిషనర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కొత్తపట్నం బస్టాండ్ సెంటరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ రోడ్డు ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించామని, దీంతో రోడ్డు విస్తరణ పనులు చేపడతామన్నారు. అలాగే రూ.9లక్షలతో సిమెంట్‌రోడ్డును నిర్మిస్తామని తెలిపారు. అంతేగాకుండా బస్టాండ్ సెంటర్‌ను సర్కిల్‌గా ఏర్పాటు చేస్తామని, దీనివల్ల ఆర్టీసీ బస్సులు ఆగేందుకు, వాహనాల రాకపోకలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని చెప్పారు. ఇటు కమ్మపాలెం నుంచి హైవేకు, కొప్పోలు జాతీయ రహదారికి, పలు గ్రామాలకు వెళ్లేందుకు ట్రాఫిక్ సమస్యను నివారించవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

నివాళులర్పించిన పలు సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు



ఒంగోలులోని పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న రామాంజనేయులు, విద్యార్థినులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వివిధ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

- దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని, ఆడపిల్లల కోసం పాఠశాలను ప్రారంభించిన ఘనత సావిత్రిబాయి పూలేకు దక్కుతుందని జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.సుధారాణి, డి.జోత్స్నదేవి, జిల్లా ప్రొబేషన్ అధికారి పి.బాలప్రభాకర్ పాల్గొన్నారు.

- స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకుని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణతో పాటు పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కరవది సుబ్బారావు, ఆర్.వెంకట్రావు, వీరారెడ్డి, హనుమారెడ్డి, రామకృష్ణ, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు, ఎస్‌డీ.సలార్, ఎం.వెంకయ్య పాల్గొన్నారు.

- ఐద్వా ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలో సావిత్రిబాయిపూలే జయంతిని నిర్వహించారు. కె.రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, ఆదిలక్ష్మి, జి.కళ్యాణి, ఎస్.ఇంద్రజ్యోతి, పి.లక్ష్మి, కె.పద్మ, బి.ఉష, కె.శ్రీలత, ఎ.సత్యవతి, కె.సీతమ్మ, కుసుమ, నాగూర్, గురువర్ధిని, డి.పద్మ పాల్గొన్నారు.

- దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, వై.సుష్మ, పి.యామినిఅమ్మాజీ పాల్గొన్నారు.

- మంగమూరురోడ్డులోని ఎస్ఎస్ఎన్‌డిగ్రీ కళాశాలలో డైరెక్టర్, ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణరెడ్డి సావిత్రిబాబుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జె.రాజేంద్రబాబు, రవితేజ, ఎస్‌కే.నిరోషా, అశోక్, టి.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

- బహుజన టీచర్స్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు, ఏల్చూరి మాధవరావు, పారాబత్తిన జాలరామయ్య, మద్దిరాల శరత్‌చంద్రబాబు, కర్ర దేవసహాయం, పల్లె కృష్ణమూర్తి, కొండమూరి కొండలరాయుడు, ఏల్చూరి భాగ్యం, గాలిమోటు భాస్కరరావు, ఎస్.భాస్కరరావు, బొంత కళ్యాణ్, వీరనారాయణ పాల్గొన్నారు.

మహిళాలోకానికి ఆశాజ్యోతి



నివాళులర్పిస్తున్న రచయిత్రులు

ఒంగోలు(కల్చరల్): మహిళాలోకానికి ఆశాజ్యోతి సావిత్రిబాయిపూలే అని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ పేర్కొన్నారు. సావిత్రిబాయిపూలే 195వ జయంతిని స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శక్తిసదనంలో మహిళాభ్యుదయ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షురాలు బీరం అరుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాళం నరసమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్యకుమారి, శక్తిసదన్ సూపరింటెండెంట్ తమ్మిశెట్టి రమాదేవి, లైజన్ ఆఫీసర్ కె.శాంతిలత, గుంటుపల్లి శ్రీదేవి, సీహెచ్.కనకదుర్గ, మలాన్ భాను, పి.నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..



సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సంతనూతలపాడు: స్థానిక జడ్పీహైస్కూల్లో, టీడీపీ కార్యాలయంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వెలుగు కార్యాలయంలో ఏపీఎం బాబూరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ధనలక్ష్మి, సభ్యులు ఎన్ఎస్.చౌదరి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఎస్.ఉమామహేశ్వరి, టీడీపీ నాయకులు ముప్పరాజు శ్రీను, మందాడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తూర్పునాయుడుపాలెంలో..

టంగుటూరు: మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని జడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణలో శుక్రవారం సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయిపూలే చిత్రపటానికి స్కూల్ హెచ్‌ఎం ఎన్‌వీ.సుధారాణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆరువేల రూపాయల విలువైన క్రీడా దుస్తులను స్కూల్ క్రీడాకారులకు ఆమె అందించారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

సంతనూతలపాడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు చీమకుర్తికి చెందిన బూచేపల్లి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్టు అందజేసిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, హెచ్‌ఎం నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్



వెంకట్రాజుపాలెంలో అర్జీ ఇస్తున్న మహిళ

మద్దిపాడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను వినియోగించుకొని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వరకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఏడుగుండల్లపాడు, వెంకట్రాజుపాలెం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు నిర్ణీత కాలంలో పరిష్కరిస్తామని చెప్పారు. మండలంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. కార్యక్రమంలో డీటీ అజయ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు జయంత్‌బాబు, ఎంటీ.బాబు, శిల్పసౌందర్య, సిబ్బంది పాల్గొన్నారు.

చిలకపాడులో..

సంతనూతలపాడు: చిలకపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 5 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తకోటలో..

నాగులుప్పలపాడు: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ కోరారు. కొత్తకోట గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా 10 అర్జీలు వచ్చాయని, మూడు అర్జీలు తక్షణమే పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్వేయరు రత్నాకర్, ఆర్ఐ రమేష్, వీఆర్వో సుబ్బరామయ్య, ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల సంక్షేమం కోసమే బోర్డు ఏర్పాటు : ఆర్ఎం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతుల సంక్షేమం కోసమే బోర్డు ఏర్పాటు జరిగిందని రీజనల్ మేనేజర్ బుల్లి సుబ్బారావు తెలిపారు. ఒంగోలులోని పొగాకు బోర్డు కార్యాలయంలో శుక్రవారం 49వ పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ ఎలాంటి విపత్తులు ఎదురైనా పొగాకు బోర్డు రైతులకు అండగా ఉంటుందన్నారు. బోర్డు ద్వారా రైతుల కోసం చేపడుతున్నత కార్యక్రమాలను వివరించారు. అనంతరం పలువురు పొగాకు రైతులు మాట్లాడుతూ సీటీఆర్ఐ సహకారంతో ఆధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చి పొగాకు సాగును సులభతరం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు సభ్యుడు బ్రహ్మయ్య, కందుకూరు పొగాకు పరిశోధన సంస్థ అధిపతి అనురాధ, విజిలెన్స్ అధికారి సురేఖ, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థినులు



విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందిస్తున్న డైరెక్టర్

ఒంగోలు విద్య, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ చదువుతున్న ఇరువురు విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సీఎస్ఈ విద్యార్థిని షేక్ షబీహా, ఈసీఈ చదువుతున్న గుంజి లలితవికసిత్ ఈనెల 10న ఢిల్లీలో జరిగే భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కాంపిటేషన్ జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. శుక్రవారం స్థానిక క్యాంపస్‌లో విద్యార్థులను క్యాంపస్ డైరెక్టర్ భాస్కర్‌పటేల్, ఏవో చంద్రశేఖర్, ఎఫ్‌వో మీరావలి, డీన్ శివాంజనేయులు, రవిచంద్ర సంపత్‌బాబు అభినందించారు.

రెడ్డి సంఘం హాస్టల్‌లో వసతుల కల్పనకు చర్యలు

● దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రెడ్డి హాస్టల్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు సహకారాన్ని అందిస్తానని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని రెడ్డి హాస్టల్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. అక్కడ హాస్టల్ భవనాలను పరిశీలించడంతో పాటు విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రెడ్డి హాస్టల్ ప్రతినిధులతో శివప్రసాద్‌రెడ్డి సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. హాస్టల్‌లో 50మంది విద్యార్థులు ఉంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయా అంశాలపై స్పందించిన శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ హాస్టల్‌లో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బత్తుల బ్రహ్మానందరెడ్డి, చంద్రారెడ్డి, పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

తామర పురుగు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

నాగులుప్పలపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మిరప పంటలో కనిపించే తామర పురుగు పట్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష సూచించారు. మండలంలోని కండ్లగుంట, మాచవరం గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మిరపలో తామర పురుగు సోకకుండా ఉండటానికి ముందస్తుగా 10000 పీపీఎం గాఢత కలిగిన వేపనూనెను పంట బాగా తడిచేలా పిచికారి చేయాలని తెలిపారు. పురుగు ఇప్పటికే ఉంటే రిజెంట్ మందును ఎకరానికి 50 గ్రాములు పిచికారి చేయాలని, ఇక మెగ్నీషియం ఒక కేజీ, బోరాన్‌జింక్ 0.5 కేజీ చొప్పున పిచికారి చేయడం ద్వారా మొక్కలకు బలం చేకూరుతుందని సూచించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, పద్మిని, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉప్పుగుండూరు కాలేజీలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

● హాజరుకానున్న ఎమ్మెల్యే బీఎన్

నాగులుప్పలపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న బోజన పథకాన్ని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ప్రారంభించనున్నారు. ఈమేరకు శుక్రవారం ప్రిన్సిపాల్ రంగనాయకులు ఓ ప్రకటనలో తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

చీమకుర్తి, జనవరి3(ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధంగా కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు చేపడతామని చీమకుర్తి సీఐ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి అసాంఘిక కార్య కలాపాలు నిర్వహణపై సమాచారం తెలిసినవారు 9121102131 సెల్ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన వెల్లడించారు.

ఇద్దరికి గాయాలు

మార్కాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్కూల్‌బస్సు ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన శుక్రవారం మార్కాపురంలో జరిగింది. ఎస్ఐ సైదుబాబు కథనం మేరకు, పట్టణంలోకి ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు పిల్లల్ని ఎక్కించుకొనేందుకు పెద్దనాగులవరం రోడ్డులోని సందులోకి వెళ్లే క్రమంలో డ్రైవర్ రివర్స్ గేర్ వేశాడు. అదే సమయంలో బస్సు వెనుకనే ఉన్న బైకులపై ఉన్న ఇరువురు దానికి కిందపడి గాయపడడంతో స్థానికులు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా
ముగ్గుల పోటీలు

- మహిళలేకాకుండా విద్యార్థినులు సైతం పాల్గొనడం అభినందనీయం
- సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదం
- అద్దంకి ఎంపీడీవో శింగయ్య


అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు

అద్దంకి, జనవరి3 (ఆంధ్రజ్యోతి): ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందని ఎంపీడీవో శింగయ్య చెప్పారు. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల


నేను సైతం...

పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)తోపాటు రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకి మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆం ధ్రజ్యోతి ఒంగోలు బ్రాంచ్ మేనేజర్ ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా, భవిష్యత్ తరాలకు ముగ్గుల పట్ల ఆసక్తి పెంచేలా పోటీలు నిర్వహించటం సంతోషకరమని చెప్పారు. మహిళలే కాకుండా కళాశాల విద్యార్థినులు సైతం పోటీలలో ఉత్సాహంగా పాల్గొనటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకర్, సందిరెడ్డి శ్రీనివాసరావు, రఫీ, న్యాయవాది గృహలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, జ్యోతి చంద్రమౌళి, దేవపాలన, దివాకర్‌దత్, కాకర్ల వెంకటేశ్వర్లు, తమ్మన శ్రీనివాసరావు, ఆం ధ్రజ్యోతి ఒంగోలు యూనిట్ ఎడిషన్ ఇంచార్జి ఆళ్ల శ్రీనివాసరావు, బాపట్ల స్టాఫ్ రిపోర్టర్ నవీన్, ఇతర సిబ్బంది, చైతన్య, హర్షిణి కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీనివాసరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా రత్నకుమారి, జ్యోతిష్మతి, నాగరాజకుమారి వ్యవహరించారు.






తీర్చిదిద్దిన రంగవల్లులు


న్యాయనిర్ణేతలను సన్మానిస్తున్న ఆంధ్రజ్యోతి బీఎం ఐవీ సుబ్బారావు, రోటరీ సభ్యులు వీరయ్య,మురళీసుధాకర్, సందిరెడ్డి, రఫీ

స..రి..గ..మ..ప..ద..ని..!

- పగలు సంగీత శిక్షణ, రాత్రివేళ భిక్షాటన
- వాగ్గేయకారుడు త్యాగయ్య స్ఫూర్తితో ఈశ్వరయ్య

సంగీతమే ఆయన శ్వాస.. ధ్యాస.. నిరంతరం సంగీతం సాధన, శిక్షణలోనే జీవితాన్ని ధారపోశాడు. ఇప్పటి వరకు సుమారు 4 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి సంగీత ప్రపంచానికి పరిచయం చేశారు. ఇంత చేస్తున్న ఆయన.. సంగీత విద్వాంసుడు త్యాగరాజు స్ఫూర్తితో జీవితాన్ని సంగీతానికే త్యాగం చేశాడు. అతనికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. అలాగని డబ్బులు తీసుకుని శిక్షణ ఇవ్వడు.. పగలు శిక్షణ ఇస్తూ, రాత్రిపూటి భిక్షాటన చేస్తూ కాలం గడుపుతున్నాడు. ఆయనే ఇడమకంటి ఈశ్వరయ్య.

డ్రమ్స్‌లో మంచి పేరు తెచ్చుకున్నా

బోదనం శ్రీనివాసులు, కంభం



ఈశ్వరయ్య దగ్గర 25 సంవత్సరాలు సంగీతంలో శిక్షణ తీసుకుని డ్రమ్స్ వాయించడంలో రాష్ట్రంలోనే పేరు సంపాదించా. ఉచితంగా శిక్షణ ఇస్తున్న కంభంలో రాష్ట్ర ప్రభుత్వం సంగీత కళాశాల ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ప్రభుత్వం హాస్టల్ వసతి కల్పించాలి

కె.కిరణ్, కాకర్ల



ఈశ్వరయ్య కాకర్లలో ఉచిత సంగీత శిక్షణ ఇస్తున్న సమయంలో నేను ఆయన వద్ద క్లారినెట్‌లో ప్రావీణ్యం సంపాదించాను. కంభంలో ఉచితంగా సంగీతం నేర్చుకునే వారికి ప్రభుత్వం హాస్టల్ వసతి కల్పించాలి.

సంగీత కళాశాల ఏర్పాటు చేయాలి

ఇ.మధు, సత్యవోలు



కంభంలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చే వారికి ఈశ్వరయ్య ఏ ప్రతిఫలం ఆశించకుండా సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం ఆయన ఆధ్వర్యంలో సంగీత కళాశాల ఏర్పాటు చేయాలి.


కంభంలో ఈశ్వరయ్య వద్ద సంగీతం నేర్చుకుంటున్న విద్యార్థులు

కంభం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : త్యాగయ్య పూర్వీకుల గ్రామమైన అర్ధవీడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన ఇడమకంటి ఈశ్వరయ్య నిత్య సంగీత సాధకులు, శిక్షకులు. త్యాగయ్యపై ఉన్న గౌరవంతో, ఆయన స్ఫూర్తితో సంగీతాన్ని బతికించుకునేందుకు 35 ఏళ్ల నుంచి తన జీవితాన్ని ధారపోస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి కాకర్లకు వచ్చిన వారి చేత ఉచితంగా సాధన చేయిస్తున్నారు. అర్బన్‌కాలనీలో కొద్ది వసతులు ఉన్న ఇంటిని అద్దెకు తీసుకుని విద్యార్థులకు సంగీతం నేర్పిస్తున్నారు. పగటి పూట సంగీత శిక్షణ, రాత్రిపూట భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు.

పొరుగు జిల్లాల నుంచి విద్యార్థులు

సంగీత సాగరాన్ని సృష్టించి తన కీర్తనలను నేటికీ సజీవంగా నిలిచిన త్యాగరాజు జీవితం అజరామరం. పామరులను సైతం మంత్రముగ్ధులను చేసిన ఆయన గాత్రం రసమయం. త్యాగయ్య పూర్వీకులు అర్ధవీడు మండలంలోని కాకర్ల గ్రామంలో సంగీత సాధన చేసిన వారు. గొప్ప కళాకారుల ఔదార్యాన్ని నమ్మి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఎంతో మంది పిల్లలను కాకర్లలో విడిచి వెళ్లేవారు. పిల్లలు పగలంతా శిక్షణ పొంది రాత్రివేళల్లో భిక్షాటన చేసి కడుపు నింపుకుని గురువు ఈశ్వరయ్య ఇంటి వద్దనే నిద్రపోయేవారు. సంగీత సాధన చేసేందుకు తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, కర్నూలు, కడప, విజయనగరం జిల్లాల నుంచి వస్తున్నారు. గతంలో కాకర్లలోని త్యాగయ్య మండపంలో సంగీత సాధన చేసేవారు. ప్రస్తుతం కంభంలో శిక్షణ పొందుతున్నారు. ఎందరో సంగీత విద్వాంసులుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం 50 మందికి పైగా విద్యార్థులు కఠోర శిక్షణ పొందుతున్నారు. రాత్రి పట్టుకుని జోలె పట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ కడుపు నింపుకుంటున్నారు. మేము ఇతర జిల్లాల నుంచి వచ్చాం, మా మాస్టర్ సంగీతం బాగా నేర్పిస్తున్నారు, ఉచితంగా నేర్పిస్తూ తమ బిడ్డల్లా చూస్తున్నారు. క్లారినెట్, ట్రంపెట్,

> కంభంలో 35 సంవత్సరాలుగా ఉచిత శిక్షణ
> రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు రాక

క్యాసియో, డ్రమ్స్, సాక్సాఫోన్ వంటి వాటిలో తర్ఫీదు పొందుతున్నామని శిక్షకులు చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వం సంగీత కళాశాల, హాస్టల్ వసతి కల్పిస్తే బాగుంటుందంటున్నారు.

ఈశ్వరయ్యను వరించిన బిరుదులు

ఇడమకంటి ఈశ్వరయ్యను పలు బిరుదులు వరించాయి. వైజాగ్‌లో కళాభారతి వారు ఆంధ్ర రత్న అవార్డుతో సత్కరించారు. బెంగళూరులో రాగసుధాకర అవార్డుతో సత్కరించారు. అద్దంకిలో సంగీత విద్యా విశారద అవార్డుతో సత్కరించారు. నంద్యాల ప్రథమ నందీశ్వరాలయంలో నంది అవార్డుతోపాటు పలు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అంతేగాక ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలలో పాల్గొని పలువురి ప్రశంసలు అందుకోవడమేకాక అవార్డులు, సత్కారాలు పొందారు.

సంగీతాన్ని బతికించడమే లక్ష్యం

ఇడమకంటి ఈశ్వరయ్య, సంగీత గురువు, కంభం

నేను ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగయ్య స్ఫూర్తితో గత 35ఏళ్లుగా అర్ధవీడు మండలం కాకర్ల, ప్రస్తుతం కంభంలో విద్యార్థులకు సంగీత శిక్షణ ఇస్తున్నా. ఇప్పటివరకు 4వేల మందికి పైగా వివిధ రకాల వాయిద్య పరికరాల ద్వారా శిక్షణ ఇచ్చా. సంగీతాన్ని బతికించడమే నా ఏకైక లక్ష్యం.


ఈశ్వరయ్యను సన్మానిస్తున్న అతిథులు


కంభంలో భిక్షాటన చేస్తున్న సంగీత శిక్షకులు

పంటల రక్షణకు చీరచుట్టు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పందుల బెడద నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు వినూత్నంగా ఆలోచించారు. చీరలతో చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేశారు. ఎర్రగొండపాలెం మండలంలోని పలు ప్రాంతాలలో మిరప, కంది, మినుము పైర్లు సాగుచేశారు. పంట ఏపుగా పెరిగిన సమయంలో పందుల బెడద ఎక్కువగా ఉండడంతో, వాటి నుంచి కాపాడుకొనేందుకు ఇలా రక్షణ ఏర్పాటు చేసినట్లు రైతులు చెబుతున్నారు. రక్షణకు చీరల ఏర్పాటు వల్ల మనుషులు ఉన్నారన్న దృష్టితో జంతువులు, అటవీ పందులు, పిచ్చుకలు ఆ వైపు రావడం లేదని పేర్కొంటున్నారు.


మిరప తోట చుట్టూ కంచెలా చుట్టిన చీరలు

క్రైం సమాచారం

స్కూల్ బస్సు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు


బైకులను ఢీకొట్టిన బస్సు

మార్కాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సును సందులోకి మళ్లించే క్రమంలో వెనకకు వెళుతుండగా అదుపు తప్పడంతో రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న ఇరువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు పట్టణంలోకి ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు పిల్లల్ని ఎక్కించుకొనేందుకు ఉదయం పెద్దనాగులవరం రోడ్డులోని మీనా మసీదు సందులోకి తిరుగుతోంది. ఈ క్రమంలో బస్సు మళ్లేందుకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో డ్రైవర్ ఆకుల శ్రీను రివర్స్ గేర్ వేసి బస్సుకు వెనక్కు తిప్పాడు. అదే సమయంలో బస్సు వెనుక ఉన్న మోటారు సైకిళ్లను చూసుకోకపోవడంతో వారి బైకులు బస్సు కిందకు దూరాయి. స్థానికులు పెద్ద ఎత్తున కేకలు వేయడంతో బస్సును డ్రైవర్ నిలిపివేశాడు. దీంతో అప్పటికే మోటార్ సైకిల్‌తోపాటు బస్సు కిందకి వెళ్లిన మీనా మసీదు ప్రాంతానికి చెందిన షేక్ మస్తాన్‌కు చేయి విరిగింది. మరో వాహనంపై ఉన్న పెద్దనాగులవరం గ్రామానికి చెందిన దొండపాటి అచ్చిరెడ్డికి కాలు విరిగింది. బస్సు కింద ఇరుక్కుపోయిన ఇద్దరిని స్థానికులు బయటకులాగి హుటాహుటిన ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చేయి విరిగిన మస్తాన్, కాలికి గాయమైన అచ్చిరెడ్డి

సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడి

- 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

పుల్లలచెరువు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కాపుకాస్తున్న నాటు సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. శుక్రవారం ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని నరజాముల తాండ సమీపంలోని అటవీ ప్రాంతంలో బట్టీలపై దాడులు చేశారు. సారా కోసం నిల్వకోసం ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాసులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మార్కాపురం నియోజకవర్గ సమావేశం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బాషా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఆటో కార్మికులు ఆటోస్టాండ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వమే స్థలం చూపించాలన్నారు. చలానాల పేరుతో కార్మికుల నుంచి అధిక మొత్తాలను వసూలు చేసే విధానం మానుకోవాలన్నారు. వ్యవసాయరంగం తర్వాత రవాణా రంగం లోనే ఎక్కువ మంది కార్మికులు ఉపాధి కలిగి ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, రూబెన్, మండల నాయకులు నాగూర్ వలి, హరున్, నాగరాజు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

45వ పర్యాయం రక్తదానం

గిద్దలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఆపరేషన్ దశలో అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో మేమున్నాము సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోకొరెడ్డి రక్తదానం చేశారు. 45వ పర్యాయం రక్తదానం చేయడం గమనార్హం.

చట్టాలు పేదలకేనా.. పెద్దలకు వర్తించవా?

- రహదారిని ఆక్రమంచి బంకుల ఏర్పాటు
- నెలకు రూ.లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్న ఓ వైసీపీ నేత
- 60 అడుగుల నుంచి 20 అడుగులకు కుంచించుకుపోయిన రోడ్డు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వీధిలో కన్నెత్తి చూడని అధికారులు


రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన బంకులు

మార్కాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో నవంబరు నెలలో ఆక్రమణలకు అధికారులు శ్రీకారం చుత్తరు. ప్రధాన వీధులన్నింటిలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. రహదారికి ఆనుకుని కాలువలపై అక్రమంగా నిర్మించిన గదులు, బంకులను తొలగించారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించేందుకు తీసుకున్న ఈ చర్య పేదలకు ఇబ్బందులకు గురిచేసింది. అయితే పట్టణంలోని పలుచోట్ల నేటికి రహదారులు ఆక్రమణల చెరలోనే ఉన్నాయి. బడాబాబులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టి అద్దెలువసూలు చేస్తున్నా మున్సిపల్, పోలీసు యంత్రాంగాలు చోద్యం చూస్తున్నాయి. అక్కడ పనిచేసిన చట్టం ఇక్కడ పనిచేయకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లేదారిలో వైసీపీకి చెందిన ఓ వ్యాపారవేత్త రహదారిని ఆక్రమించాడు. యథేచ్ఛగా బంకులు ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం నెలకు వాటి నుంచి రూ.2 లక్షలకుపైగా ఆ అద్దెల మాటున వసూలు చేసుకుంటూ జేబులు నింపు కుంటున్నాడు. అక్రమ బంకుల పుణ్యాన నిత్యం ఈ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయం అన్నిస్థాయిల అధికారులకు తెలిసినా ఆర్థిక వనరులున్న వ్యక్తి కావడంతో అతని జోలికెళ్లేం దుకు వెనకడుగు వేస్తున్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్న చందాన ప్రభుత్వ యంత్రాంగానికి కూడా నెల మామూళ్లు వెళ్లడంతోనే పట్టించు కోవడంలేదని తెలుస్తోంది.


ఆక్రమణలతో నిత్యం ఇలా స్తంభించిపోతున్న ట్రాఫిక్

60 అడుగుల రహదారి 20 అడుగులైన వైనం

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఎన్ఎస్ నగర్ వెళ్లే దారి ఒకప్పుడు 60 అడుగులు ఉండేది. రెవెన్యూ రికార్డుల్లో కూడా సర్వే నెంబర్ 395/బిలో 1.50 ఎకరాలు రహదారి ఉన్నట్లు చూపుతోంది. వీటిలో ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాల యానికి వెళ్లేదారి మొదట్లో 50 అడుగులతో ప్రారంభమై చివర్లో 60 అడుగుల మేర విస్తరించి ఉంది. కానీ ఆర్అండ్‌బీ రహదారి ప్రారంభం నుంచి ఏబీఎం హైస్కూల్ వైపు చర్చి వరకు సుమారు 20కిపైగా బంకులను ఓ వ్యాపారవేత్త ఏర్పాటు చేశారు. నెలకు ఒక్కో బంకు నుంచి రూ.5 వేలకుపైగా అద్దెలు వసూలు చేస్తున్నాడు. ఏబీఎం హైస్కూల్ వైపు ఉన్న స్థలం తనదని సదరు వ్యాపారవేత్త రహదారిని బంకుల మాటున సుమారు 20 అడుగుల మేర ఆక్రమించాడు. ఒకప్పుడు ఆ రహదారి వెంబడి బండరాళ్లు కంకరగా చేసే దినసరి కూలీలు జీవనం వెళ్లదీసేవాలు. తర్వాత కాలంలో ఆర్థిక వనరులే అండగా వైసీపీకి చెందిన వ్యాపారవేత్త ఆక్రమణలకు తెరతీశాడు. సుమారు 15 సంవత్సరాలుగా అక్రమంగా ఏర్పాటు చేసిన బంకుల నుంచి అద్దెలు వసూలు చేస్తున్నాడు. ఇప్పటి వరకు సుమారు రూ.కోట్లలో అక్రమంగా అద్దెలు వసూలు చేసుకున్నాడు. ఈ విషయం అన్నిస్థాయిల అధికారు లకు తెలిసినా మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోలేదని జగమెరిగిన సత్యం. మార్కాపురం పట్టణానికి నడికూడలి వంటి ప్రాంతంలో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతున్నాయి. దీంతో ట్రాపిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా అక్రమ బంకులను తొలగించడానికి అధికారులు చొరవ చూపకపోవడంపై ప్రజలు బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్వే చేసి ఆక్రమణలు ఉంటే తొలగిస్తాం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లేదారిలో ఆక్రమణలు ఉన్నట్లు ఇప్పటికే మాకు ఫిర్యాదులు అందాయి. రెవె న్యూ రికార్డుల మేరకు రహదారికి కొలతలు వేయిస్తాం. రహదారిని ఆక్రమించినట్లు తేలితే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. ఆక్రమణలను అక్కడికక్కడే తొలగిస్తాం. చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం.

చిరంజీవి, తహసీల్దార్, మార్కాపురం

అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ తులసమ్మ దిశానిర్దేశం


మాట్లాడుతున్న ఎంపీడీవో, పక్కన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు

కంభం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలని ఎంపీపీ తులసమ్మ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మూడు మాసాలకు ఒక పర్యాయం జరిగే సర్వసభ్య సమావేశానికి కొంతమంది అధికారులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరుకాని అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. సమావేశంలో పాల్గొనే ఆయా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమస్యలు తెలిపితే ఆయా శాఖల అధికారులు ఓపికతో సమాధానం చెప్పాలన్నారు. సర్పంచ్ బోడయ్య మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని సమయంలోనే ఉపాధి పనులు చూపాలని కోరారు. తద్వారా రైతులకు మేలు చేసిన వారు అవుతారన్నారు. ఎల్.కోట సర్పంచ్ ఖాదర్‌వలి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం ఏడాది కాలంగా అసంపూర్తిగా నిలిచిందన్నారు. వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే ఆదేశించినా అధికారుల్లో చలనం లేదన్నారు. వ్యవసాయాధికారి స్వరూప మాట్లాడుతూ మండలంలో అత్యధి కంగా శనగ, మినుము, పొగాకు పంటలను సాగు చేశారన్నారు. రావిపాడు సర్పంచ్ కోట య్య మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి మండలంలో మినుము పంట బాగా దెబ్బతిందని వ్యవసాయాధి కారులు పంటనష్టం వివరాల్లో మినుము పంట చేర్చలేదన్నారు. పక్క మండలంలో మినుము పంట వివరాలు సేకరిస్తుంటే కంభం మండలంలో వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో మినుము రైతులు నష్టపోతారని, న్యాయం చేయాల న్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, అధికారులు పాల్గొన్నారు. ఇక డిసెం బరు 20న అనారోగ్యంతో మృతిచెందిన ఔరంగబాద్ సర్పంచ్ వరికుంట్ల కళావతికి నివాళులు అర్పించారు.

5,6 తేదీలో ఒంగోలుకు ఎస్సీ కమిషన్

రాష్ట్ర ఎస్సీ కమిషన్ రాజీవ్ రంజన్‌మిత్ర, ఆయన బృందం ఈ నెల 5, 6 తేదీలలో ఒంగోలులో పర్యటిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ 6వ తేదీ సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రకాశం భవన్‌లో జరిగే సమావేశంలో చైర్మన్ పాల్గొంటారన్నారు. మండలంలోని సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు మీ ప్రాంతాలలో ఏమైనా సమస్యలుంటే కమిషన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు.

5 నుంచి క్రికెట్ టోర్నమెంటు

గిద్దలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రాచర్ల మండలం అక్కపల్లి గ్రామంలో ఈ నెల 5 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అక్కపల్లి యూత్ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.30వేలు, రెండవ బహుమతి రూ.20వేలు, మూడవ బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 4వ తేదీ సాయంత్రం లోగా రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 8465047672, 7995174520 నంబర్లను సంప్రదించాలన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌టీవో చంద్రశేఖర్

పొదిలి. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ డైరి, క్యాలెండర్‌ను ఎస్‌టీవో బి.చంద్రశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ డైరి అన్ని విధాలుగా పెన్షనర్లకు ఉపయోగపడే విధంగా రూపొందించారన్నారు. అంతేకాకుండా పెన్షనర్ల లైఫ్ సర్టిఫికేట్‌లు సమర్పించేందుకు కార్యాలయంలో ఫేస్‌ఆర్‌డీయాప్, ఐరీస్, బయోమెట్రిక్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సదావకాశాన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరగా సర్టిఫికేట్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అధ్యక్ష, కార్యదర్శులు ఏ బాదుల్లా, మదార్‌వలి, నాయకులు ఏ వీరారెడ్డి, చిట్యంశెట్టి సుబ్బారావు, మోహన్‌రావు, గోవిందయ్య, డీఎల్ నరసింహం, మూసా జాని, శ్రీధర్, శర్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గిద్దలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతి యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వెంకటదాసు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కోసం ఈ నెల 5వ తేదీలోగా స్థానిక మెప్మా కార్యాలయంలో ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ రిపేర్, గ్రీజర్ రిపేర్, టీవీ రిపేర్, రిఫ్రిజిరేటర్ రిపేర్, వాషింగ్‌మిషన్ రిపేరు, బ్యూటీషియన్ (పురుషులు మరియు స్త్రీలు), తదితర సేవలు అందించే వారికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు అందజేస్తామన్నారు. శిక్షణ పొందిన వారికి జీవనోపాధి కల్పించే అవకాశం ఉన్న దృష్ట్యా రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, పాన్‌కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 7901610226, 8340098976 సంప్రదించాలని పేర్కొన్నారు.

గ్రామసభల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

- తహసీల్దారు శ్రీనివాస్

త్రిపురాంతకం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఉన్న భూసమస్యలను రైతులు గ్రామసభల ద్వారా అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దారు జి.శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్థుల నుంచి వచ్చిన అర్జీలు తహసీల్దారు స్వీకరించారు. పట్టాదారుపాసుపుస్తకం కోసం 4, నూతన పాసుపుస్తకం కోసం 1, అడంగల్‌లో మార్పు కోసం 1 మొత్తం ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ముకుందహరి, సర్పంచ్ పీవీ.లక్ష్మీ, ఎంపీపీ రిబ్కా, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు మోటకట్ల శ్రీనివాసరెడ్డి, నాయకుడు ఎం.రామిరెడ్డి, వీఆర్వోలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఈ నెల 10న ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బండారు శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అధ్యక్షతన ఈ సమావేశం ఉంటుందన్నారు. కావున జెడ్‌పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరుకావాలన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నిరసన తెలపుతున్న మున్సిపల్ కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలలో మంచినీటి నిర్వాహణ, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్, ఆఫీస్ నిర్వాహణ తదితర విభాగాలలో 13వేల మంది కార్మికులు 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారన్నారు. కార్మికులకు జీవోఎంఎస్ నెం.36 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు అనంతరం కమిషనర్ నారాయణకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, హరి, హిమాంసా, చెన్నకేశవులు, శ్రీను, రమణ, కనకయ్య, రషీద్, అల్లూరయ్య, శేఖర్ పాల్గొన్నారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో జగదాంబ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో జగదాంబకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వరుణ్‌తేజశర్మ జగదాంబ మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అర్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మ వారిని దర్శించుకుని పూజ లుచేశారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక శ్రీ లక్ష్మీచెన్నకేశ స్వామి ఆలయంలో ప్రధానర్చకులు శ్రీపతి అప్పనా చార్యులు రాజ్యలక్ష్మీ అమ్మవారి మూల విరాట్‌కు, ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

హుండీ ఆదాయం రూ.5లక్షలు

మార్కాపురం వన్‌టౌన్: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి హుండీ ఆదాయం ఆలయ మధ్యరంగ మండ పంలో శుక్రవారం లెక్కించారు. మూడు నెలల హుండీ ఆదాయం రూ.5,85,374 వచ్చిందని ఆలయ ఈవో గొలమారి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీమెటీరియల్‌తో విద్యార్థులు

తర్లుపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో స్టడీమెటీరియల్‌ను హెచ్ఎం సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్టీయూ శాఖ క్యాలెండర్, డైరీలను సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షులు కశ్శెట్టి జగన్ బాబు, ఉపాధ్యాక్షులు బండి రాజారమేష్, శ్రీనివాసులు, అంజన్‌కుమార్, జి.ఆదినారాయణ, బి.రంగయ్య, నంద్యాల కాశయ్య, ఎస్‌వీ నరేంద్ర, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు బాల్యంపై అవగాహన


మాట్లాడుతున్న వివిధ శాఖల అధికారులు

పొదిలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పొదిలిలోని కేజీబీవీ విద్యార్థులకు శుక్రవారం బంగారుబాల్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖ, శిశుసంక్షేమశాఖల బాలికల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. వివాహ వయసు రాకుండా పెళ్లి చేయడం నేరమని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు అనురాధ, ఒకటవ సచివాలయం కార్యదర్శిఅశోక్‌రెడ్డి, ఏఎన్ఎం విజయ, ఎంఎల్‌హెచ్‌పీ, మహిళలా పోలీస్ కుసుమ, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిభాయిపూలే జయంతి

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించి ఆధునిక విద్య ద్వారా స్త్రీలలో అభ్యుదయం నింపి ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దిన గొప్ప ఆదర్శమూర్తి సావిత్రిబాయ్ పూలే అని ఎంఈవో పి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఆమె జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూ వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్న ఆదర్శంగా నిలిచిన ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి సన్మానించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 మల్లునాయక్, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని చిన్నదోర్నాల ఎంపీయూపీ పాఠశాలలో సావిత్రీభాయి పూలేజయంతి సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసులు అధ్యక్షతన పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు కోటేశ్వరీ, కెజియా రాణిని శాలువా కప్పి సత్కరించారు.

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిభాయిపూలె జయంతిని ఘనంగా నిర్వహించారు. బాలిక విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉద్యమకారిణి, నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని మున్సి పల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చంద్రశేఖర్‌యాదవ్, పెద్దవలి, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షులు షహన్షావలి, కొమ్మునూరు సర్పంచ్ రామ సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక శుక్రవారం బీసీభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్, నాయకులు జి.సుబ్బారావు, రంగస్వామి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రమణ పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో శర్వాణి మాట్లాడుతూ సావిత్రిబాయి సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కోఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ బాలయ్య పాల్గొన్నారు.

గిద్దలూరు: పట్టణంలోని సావిత్రిబాయి విగ్రహం వద్ద కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిడతల రమేష్‌రెడ్డి, పలువురు బీజేపీ నాయకులు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఒబిసి ప్రధాన కార్యదర్శి దూదేకుల బాదుల్లా పలువురు పాల్గొన్నారు.


వై.పాలెంలో మహిళా ఉపాధ్యాయులకు, వారి పిల్లలకు సన్మానం

విద్యతోనే బంగారు బాల్యం

పామూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యతోనే బాలికలకు బంగారు బాల్యంతో పాటు మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. శుక్రవారం మండలంలోని వగ్గంపల్లి గ్రామ సచివాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతినెలా మొదటి శుక్రవారం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. బడి మానివేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నారు. లింగ వివక్షత, బాల్యా వివాహాలతో పిల్లలు విద్యకు దూరమవుతున్నారన్నారు. దీనిని అరికట్టేందుకు కమిటీ కృషి చేయాలన్నారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ బి.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఇండ్ల హరినారాయణ, హెచ్ఎం పి.అరుణకుమారి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్, అంగన్‌వాడీ కార్యకర్త దేవిశ్రీ, రామాంజనమ్మ, మరియమ్మ, సువార్తమ్మ, ఎంఎస్ విజయలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవాలయ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

పామూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన దేవాలయ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు నొస్సం నాగేంద్రచారి డిమాండ్ చేశారు. ఎంతో చరిత్ర కలిగిన మఠంలో సమాధులను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మఠానికి సంబంధించి ఇప్పటికే రూ.10 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగమయ్యాయన్నారు. తక్షణమే ప్రభుత్వం అతని అరాచకాలపై విచారణ చేపట్టి మఠం ఆస్తులను, సమాధుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో మఠం సంరక్షణ కోసం ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

కనిగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నంద్యాల ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఏడాది జైలుతో పాటు, రూ.5 లక్షలు జరిమానా విధిస్తూ కనిగిరి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర శుక్రవారంతీర్పు ఇచ్చారు. కోర్టు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల మండలంలోని నూనెపల్లి గ్రామానికి చెందిన పఠాన్ అబ్దుల్ కరీంఖాన్ పామూరు పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌బాషా నుంచి రూ.7 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఇందుకుసంబంధించి రూ.5 లక్షలకు చెక్కు ఇచ్చా రు. ఈ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. కేసు విచారణ అనంతరం కరీంఖాన్‌కు శిక్షను ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కనిగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు ఆకస్మిక దాడిచేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ టి.శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కృష్ణాపురం గ్రామంలోని శివారు కొండ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. సిబ్బందితో కలసి గొర్రెల కాపరుల వేషంలో వెళ్ళి పేకాట స్థావరాన్ని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. రూ.16,100 నగదుతో పాటు 5 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలి

» **టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి

దర్శి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు, స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరిలోని సీసీఎల్ఏలో జరిగిన రెవెన్యూ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దర్శి నియోజకవర్గంలో అనేక చోట్ల ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి ప్రకాశంలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి పలు అంశాలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. దర్శి పట్టణంలోని బండిదారి స్థలంలో నిర్మించిన ఆక్రమణలను తొలగించాలని కోరారు. అలాగే, దర్శి-అద్దంకి రోడ్డులోరి ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని, దర్శి-పొదిలి రోడ్డులోని ప్రభుత్వ స్థలాలు, కాటేరు వాగు ఆక్రమణలు తొలగించాలని కోరినట్టు ఆమె తెలిపారు.

రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్న ఈ సమావేశంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై పూర్తి వివరాలతో వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి స్వాహా చేశారని ఆమె పేర్కొన్నారు. ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని సూచించారు.

పార్కు అభివృద్ధికి కృషి

దర్శి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పల్లెవనం పార్కు అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అధికారులతో కలిసి పార్కును పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాయంత్రం పూట పార్కును తెరవలేదు. ఇటీవల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పార్కును పరిశీలించి ఉదయం, సాయంత్రం పార్కును తప్పనిసరిగా తెరవాలన్నారు. ఈనేపథ్యంలో డాక్టర్ లలిత్‌సాగర్ సాయంత్రం వెళ్లి పార్కును పరిశీలించగా పార్కు తెరచిఉంది. పార్కులో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఆకతాయిలు పార్కులో వస్తువులు చెడగొట్టకుండా రక్షణ కల్పిస్తామని చెప్పారు. సీఐ వై.రామారావు, ఎస్సై ఎం.మురళీ నేతృత్వంలో పార్కులో డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రీసర్వే తప్పులు సరిచేయని సదస్సులు ఎందుకు?

» **శివరాంపురం రైతుల ఆవేదన**



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పేరిట గత ప్రభుత్వం రైతుల భూములను తప్పులతడకలుగా చేయగా, కూటమి ప్రభుత్వం సరిదిద్దుతామని రెండునెలల క్రితం గ్రామసభ పెట్టి అర్జీలు తీసుకుందని శివరాంపురం రైతులు పేర్కొన్నారు. నేటికి ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. ఈక్రమంలో మరలా రెవెన్యూ సదస్సు నిర్వహించటం వల్ల ఏమి ప్రయోజనమని అధికారులను నిలదీశారు. శుక్రవారం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తమ గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో పనిచేసిన వీఆర్వో అంతా తానై వ్యవహరించి రీసర్వే సమయంలో రెవెన్యూ రికార్డులను తప్పుల తడకలుగా మార్చారన్నారు. రీసర్వేతో గ్రామంలో దాదాపు 400 సర్వే నంబర్లలో తప్పులు దొర్లాయన్నారు. రికార్డులు సక్రమంగా లేవని బ్యాంక్‌లో రుణాలు ఇవ్వకపోగా, గతంలో తీసుకున్న రుణాలకు రీషెడ్యూల్ కూడా చేయటం లేదన్నారు. రెండు నెలల క్రితం రీసర్వే తప్పులను సరిదిద్దేందుకు గ్రామసభ పెట్టి అర్జీలు తీసుకున్నారని, ఇంతవరకు ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు.

దీనిపై తహసీల్దార్ సంజీవరావు మాట్లాడుతూ ఈ సమస్యపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. త్వరలో తగు నిర్ణయం తీసుకుని రీసర్వే వల్ల రైతాంగం పడుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతారన్నారు. గ్రామంలో రీసర్వే వల్ల జరిగిన తప్పిదాల వల్ల రైతాంగం పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. గ్రామంలో రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్‌లతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతాంగానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో పి.చంద్రశేఖరరావు, గ్రామ సర్వేయర్ శ్యామ్, మాజీ ఎంపీటీసీ జి.లక్ష్మీనారాయణ, తిరుపతిస్వామి, రామకోటయ్య, మారిశెట్టి హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలి

» **మంత్రి గొట్టిపాటిని కోరిన ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు**

తాళ్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరుచేయటంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు పేర్కొన్నారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు కలిసి విజ్ఞప్తి చేశారు. అద్దంకి మండలం దేనువకొండ పర్యటనలో ఉన్న మంత్రిని ఎంపీపీ తాటికొండ కలిసి పలు సమస్యలను విన్నవించారు. తాళ్లూరు ప్రాంత రైతాంగం వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు తీసి నెలలు దాటుతున్నా ఏర్పాటులో జాప్యం జరుగుతున్నదని తెలిపారు. శివరాంపురం సమీపాన నిర్మిస్తున్న 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వేగవంతగా పూర్తిచేస్తే రైతాంగానికి విద్యుత్ కొరత లేకుండా ఉంటుందని తెలిపారు. వీటిపై తగు చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారని ఎంపీపీ తాటికొండ తెలిపారు.



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సమస్యలను వివరిస్తున్న ఎంపీపీ తాటికొండ

వెలిగొండతోనే పశ్చిమ ప్రాంతం అభివృద్ధి

» **సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు**

పామూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుతోనే పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం మండల సమావేశానికి షేక్ ఖాదర్‌బాషా అధ్యక్షత వహించారు. మాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆరోపించారు. పశ్చిమ ప్రాంతంలో సరైన వసతులులేక వలసలబాటలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత, ప్రస్తుత పాలకులు ఎన్నికల ముందు వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గెలిచిన తరువాత నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతున్నా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరు విప్పడంలేదని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో కె.మాల్యాద్రి, సయ్యద్ గౌసెబాషా, ఖాసీం సాహెబ్, వై.వీరనారాయణ, ఎం.రామయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.శంకర్, ప్రసాద్, అల్లాభక్ష్, రజియా, భానుమతి, ఖాదర్ ఉన్నీసా, మదారమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాబు

కాగా, స్థానిక విరువూరు రోడ్డులోని జుమ్మా మసీదు ప్రాంతంలో పలువురు ముస్లింలను సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సయ్యద్ హనీఫ్ తదితరులు ఉన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

» **తహసీల్దార్ రమాదేవి**

దొనకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని తహసీల్దార్ బి.రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇండ్లచెరువులో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి అర్జీని పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదుచేసి రసీదు ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



దొనకొండ: రెవెన్యూ సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

సమస్యల పరిష్కారానికే సదస్సులు

పామూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న రైతు సమస్యలను పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. మండలంలోని నుచ్చుపొద గ్రామ పంచాయతీ పరిధిలోని చిలకపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు యారవ శ్రీనివాసులు, పాలపర్తి రమణయ్య, బత్తుల మురళీకృష్ణ, బండారు ప్రసాద్, ఆర్ఐ బి.మల్లికార్జున, సర్వేయర్ పసుపులేటి సాయి, వీఆర్వోలు చెన్నకేశవులు, కేసీ వెంకటస్వామి, షేక్ రసూల్, సరస్వతి, పంచాయతి కార్యదర్శి షేక్ ఆదాంబీ పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

దర్శి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిటాల శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మండలంలోని చెరువుకొమ్ముపాలెంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈసందర్భంగా పలు సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల పరిష్కారం

ముండ్లమూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలను పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని సింగనపాలెం, అవిశనవారిపాలెం గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా భూముల సరిహద్దులు, రికార్డుల్లో తప్పులను సరిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కె.కోటంరాజు, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, వీఆర్వో రాఘవరెడ్డి, సుజాత, గురవయ్య, మాజీ సర్పంచ్ మానం నరసింహారావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కందిమళ్ళ చంద్రమౌళి, బత్తిని ప్రసాద్, కోయ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువులో ఆక్రమణలను తొలగించాలి

కనిగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పెద్దచెరువు విస్తీర్ణాన్ని వెలికి తీయాలని పలువురు వినతపత్రాలు అందజేశారు. శుక్రవారం స్థానిక గార్లపేట రోడ్డులోని సచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఆప్రాంతానికి చెందిన ప్రజలు పెద్ద చెరువు అన్యాక్రాంతమైందని, రికార్డుల ఆధారంగా చెరువు విస్తీర్ణాన్ని బట్టి హద్దులు నిర్ణయించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. చెరువు ఆక్రమణతో ఇళ్లలోకి వర్షపు నీరు చేరుతుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పట్టణంలోని పెద్దచెరువు, నాగులచెరువు ఆధునీకరణ పనుల చేపట్టటంతో పాటు కొంతవరకు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో అధికారులు ఆక్రమణలను తొలగించకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తహసీల్దార్‌కు వివరించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

పీసీపల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మహేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల కనిగిరి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం పీసీపల్లి పోలీసుస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పలు కేసులకు సంబంధించిన వివరాలను ఎస్సై జి.కోటయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటివారైనా ఉపేక్షించవద్దని చెప్పారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా గ్రామాల్లో పేకాట, కోడిపందేలు వంటి జూదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్టేషన్‌లోని గదులు, పరిసరాలను పరిశీలించారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

ఘనంగా పూలే జయంతి

దర్శి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఆమె చిత్రపటానికి ప్రిన్స్‌పాల్ అరుణ, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె పనిచేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఆమె జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జె.కోటేశ్వరరావు, ఏ.రామారావు, హేమలత, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పామూరులో.. పామూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళా విద్య కోసం విశేష కృషిచేశారని షేక్ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని నర్రమారెళ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు నీరజ, సుజాతను సన్మానించారు. కార్యక్రమంలో టి.రమేష్, ఎస్వీ ప్రసాద్, డి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగువారిపాలెం ఏపీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. హెచ్ఎం పి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, కవయిత్రిగా, విద్యావేత్తగా సావిత్రిబాయి పూలే మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని రాణించాలన్నారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మరకాల మస్తాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థులకు వరం



శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

దొనకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర వహిస్తుందని విశ్వభారతి విద్యాలయం పాఠశాల చైర్మన్ మల్లెల రామిరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు 34 ఆంధ్ర బెటాలియన్ పీఐ స్టాఫ్ సంతోష్‌కరసింగ్, నారాయణలు పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులకు ఈనెలలో జరిగే ఏ సర్టిఫికెట్ పరీక్షకు సంబంధించి శుక్రవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణపై ఆసక్తి, పట్టుదల కనబర్చిన విద్యార్థులకు ఏ సర్టిఫికెట్ పరీక్షల్లో మంచి ఫలితం ఉంటుందని చెప్పారు. రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో శిక్షణ పొంది ఏ సర్టిఫికెట్ సాధించాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ జిలానీ, తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం సభను విజయవంతంచేయాలి

దొనకొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 5న జరిగే హైందవ శంఖారావం సభకు దొనకొండ మండలంలోని ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని ఆనంద ఆశ్రమ ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆశ్రమంలో శంఖారావం సభ కరపత్రాలను విడుదలచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేవాలయాలను మనమే రక్షించుకోవాలన్నారు. సభకు వచ్చే వారు ఐదవ తేదీ ఉదయం 5 గంటలకు ఆనంద ఆశ్రమం వద్దకు రావాలన్నారు. ఇక్కడినుంచి విజయవాడకు బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. కార్యక్రమంలో పురోహితుడు మణిబాబుశర్మ, విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

దర్శి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో ప్రైవేట్ విద్యాసంస్థలు చెలగాటమాడుతున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు ధ్వజమెత్తారు. శుక్రవారం దర్శిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలం చెల్లిన బస్సులలో విద్యార్థులను తరలిస్తున్నందున తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు గత మూడు నెలల్లో మూడుసార్లు స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణాశాఖ అధి కారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జి.స్టాలిన్, బెంజిమెన్, సురేంద్ర, కిరణ్, అరవింద్ త దితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో పారిశుధ్య కార్యక్రమాలు



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

పామూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూబగుంట పంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో కార్యదర్శి జి.నాగేశ్వరరావు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. 'అధ్వానంగా పారిశుధ్యం' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు యుద్ధప్రాతిపదికన క్లాప్ మిత్రతో కలిసి నీటి ట్యాంకువద్ద ఉన్న వ్యర్థాలను తొలగింపజేశారు. బ్లీచింగ్ చల్లించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ముండ్లమూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలమడక గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సుంకర రామిరెడ్డి(50) అప్పుల బాధతో గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామంలో వైసీపీ నాయకుడిగా ఉంటూ చిన్నచిన్న కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. వీటికి సంబంధించి బిల్లులు రాక మనస్తాపం చెందాడు. అనారోగ్యంతో పాటు అప్పుల బాధ తట్టుకోలేక కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొద్దుపోయినా కూడా ఇంటికి రాకపోవటంతో తల్లి హనుమాయమ్మతోపాటు సోదరులు ఊరిలో వెతికినా కన్పించలేదు. అనుమానం వచ్చి ఊరి చివరన ఉన్న సచివాలయానికి వెళ్ళి చూడగా ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. రామిరెడ్డికి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు అప్పులు ఉన్నట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తల్లి హనుమాయమ్మ పేర్కొన్నారు. ముండ్లమూరు హెడ్ కానిస్టేబుల్ కె.అంకారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం హర్షణీయం

కనిగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయటం హర్షణీయమని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకుడు పీవీ శేషయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల్లో ఆనందం నింపారన్నారు. డిగ్రీ విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం డిగ్రీ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలుచేసినట్లు గుర్తుచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసి పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం డిగ్రీ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శనివారం 4 జనవరి 2025





అవనిపై హరివిల్లు

- అద్దంకిలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- నాలుగు జిల్లాలకు చెందిన 101 మంది హాజరు
- ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన



ప్రథమ బహుమతి పొందిన ముగ్గుతో విజేత బోయ ఉమాదేవి



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత ప్రత్యూష



తృతీయ బహుమతి పొందిన ముగ్గుతో విజేత మాధవి

అద్దంకి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అద్దంకిలో సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణ సప్తవర్ణ శోభితమైంది. ఆకాశంలో చుక్కలను మహిళలు నేలకు దించడంతో ప్రాంగణమంతా ముత్యాల ముగ్గులతో మెరిసిపోయింది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)తో పాటు... రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 101 మంది మహిళలు పాల్గొన్నారు. మంచును సైతం లెక్క చేయకుండా వందల కిలోమీటర్ల దూరం నుంచి మహిళలు ఉదయం 9 గంటలకే అద్దంకి చేరుకున్నారు. ముగ్గులను తిలకించేందుకు పట్టణానికి చెందిన వారు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వివిధ కళాశాలల విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులపై మక్కువ చూపారు. గుంటూరుకు చెందిన బోయ ఉమాదేవి ప్రథమ బహుమతి పొందగా రూ.10 వేలు, మేదరమెట్లకు చెందిన ఎం.ప్రత్యూష ద్వితీయ బహుమతి పొందగా రూ.6 వేలు, చీరాలకు చెందిన ఎం.మాధవి తృతీయ బహుమతి పొందగా రూ.4 వేలను నిర్వాహకులు అందజేశారు. విజయశాంతి (కడవకుదురు), మణిమంజరి (ఇంకొల్లు), విజయలక్ష్మి (ఒంగోలు), సునీత (సత్తెనపల్లి), విద్యార్థినులు సుప్రియ (మేదరమెట్ల), లాస్యప్రియ(పోలవరం), హేమ(శంకరాపురం), అకీలా(జాగర్లమూడివారిపాలెం)కు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేకంగా గిఫ్ట్‌లు అందజేశారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి తరఫున డాక్టర్ ఫణీంద్రబాబు, రావూరి రంగయ్య, సంకా సుబ్రహ్మణ్యం(బాబు), పువ్వాడ రామకోటేశ్వరావులు స్పాన్సర్లుగా వ్యవహరించారు.



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు





ఇప్పటికి 16 సార్లు

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో ఇప్పటికి 16 సార్లు పాల్గొన్నాను. ప్రథమ స్థానం రావడం ఎంతో ఆనందంగా ఉంది. తెలుగు ప్రజల సంస్కృతిని కాపాడుతూ 'ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం.

- బోయ ఉమాదేవి



ప్రథమ బహుమతి రూ.10 వేలను అందుకుంటున్న బోయ ఉమాదేవి



ద్వితీయ బహుమతి రూ.6 వేలను అందుకుంటున్న ప్రత్యూష



తృతీయ బహుమతి రూ.4 వేలను అందుకుంటున్న మాధవి

ఆనందాన్ని కలిగించాయి

ముగ్గుల పోటీలు ఎంతో ఆనందాన్ని కలిగించాయి. మహిళలలో పోటీతత్వం పెంచేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడుతున్నాయి. సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్లు ఉంది.

- ఎం.ప్రత్యూష



ఆంధ్రజ్యోతికి అభినందనలు

మహిళలను ప్రోత్సహించే విధంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీల నిర్వహించడం అభినందనీయం. ముగ్గులు తెలుగుదనం ఉట్టిపడేలా ఉన్నాయి. బహుమతి పొందడం ఎంతో ఆనందంగా ఉంది.

- ఎం.మాధవి



మహిళలకు జీవనోపాధి కల్పించాలి

చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళల జీవనోపాధి పెరుగుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. అధికారులతో శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జీవనోపాధి పథకం అనుసందానంతో మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సమర్థంగా చేపట్టాలన్నారు. పాడి పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు గేదెలు పంపిణీ చేయాలన్నారు. లక్ష్యాల మేరకు మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక వేగంగా పూర్తి చేయాలన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలని డీపీవోను ఆదేశించారు. ఆక్వాపార్క్ ప్రతిపాదనపై సమగ్రనివేదిక పంపాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, డీఆర్‌డీఏ పీడీ పద్మ, డీపీవో ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు

- విద్యార్థులకు ఎమ్మెల్యే వేగేశన అభినందనలు



రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన వర్కింగ్ మోడల్‌తో నరసాయపాలెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని, గైడ్‌టీచర్‌లు

బాపట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. జిల్లాలోని 25 మండలాల నుంచి 75 పాఠశాలలకు సంబంధించిన 75 మోడల్స్ ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. వివిధ అంశాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు పోటాపోటీగా ప్రాజెక్టులు ఏర్పాటు చేయగా అవి పలువుర్ని ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో వ్యక్తిగత విభాగంలో నరసాయపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని డి.ప్రత్యూష, గైడ్ టీచర్లు ఎం.మౌనిక, కె.స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ అండ్ అగ్రికల్చర్ ప్రాజెక్టుకు ప్రథమ, అద్దంకిలోని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని ఎం.లావణ్య ప్రదర్శించిన ట్రిగ్నోమెట్రిక్‌పార్క్ ప్రదర్శనకు ద్వితీయ బహుమతులు లభించాయి. గ్రూప్ విభాగంలో సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు సి.హెచ్.సాయిరాందీరజ్, కుంచాల వెంకటేష్‌లు, గైడ్ టీచర్ కొల్లి మోహనాంజలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మల్టీపర్పస్ అగ్రికల్చర్‌మిషన్‌కు ప్రథమ, చెరుకుపల్లి వినయాశ్రమం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ఎన్.మౌనిక, షేక్.అక్షయలు ఏర్పాటు చేసిన జీయోబోర్డు-టైప్స్ ఆఫ్ యాంగిల్స్ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమలు లభించాయి. ఉపాధ్యాయుల విభాగంలో కర్లపాలెం మండలం గణపవరం జడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయురాలు డి.సుధారాణి ప్రదర్శించిన గ్రైన్‌డ్రైనర్ ప్రాజెక్టుకు ప్రథమ, బాపట్ల మండలం నరసాయపాలెం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు కె.స్వరూప ప్రదర్శించిన గ్రావిటీ బ్యాటరీ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతులు లభించాయి. విజేతలకు డీఈవో ఎస్.పురుషోత్తం బహుమతులు అందజేశారు. విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు వీరంతా వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారులు ఎ.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వర్లు, ఎంఈవోలు ఎస్.నిరంజన్, డి.ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, సైన్స్ కోఆర్డినేటర్లు ఎ.శ్రీనివాసరావు, పవనీభానుచంద్ర, వైవైరావు, సికిందర్, మీర్జాన్ తదితరులు పాల్గొన్నారు.



గ్రూప్ విభాగంలో రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన వర్కింగ్ మోడల్‌తో మక్కెనవారిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, గైడ్‌టీచర్



బహుమతి సాధించిన ప్రాజెక్ట్‌ను అధికారులు, నాయకులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



మండల సర్వసభ్య సమావేశంలో ప్రగతి నివేదికను చదువుతున్న అధికారి

గ్రామాలలో శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉపాధి హామీ కింద మంజూరు చేసిన నిధులతో గ్రామాలలో శర వేగంగా సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎంపీడీవో కె. కుసుమకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. తహసీల్దార్ రవి నాయక్ మాట్లాడుతూ గ్రామాలలో భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, రైతులు ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి, మండల కోఅప్షన్ సభ్యులు శ్రీనువలి, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అనధికారిక లేఅవుట్ల నిర్వాహకులపై కఠిన చర్యలు

వేటపాలెం(చీరాల), జనవరి 3(ఆంధ్రజ్యోతి) :ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాదారులు, అనధికారిక లేఅవుట్ల నిర్వాహకులపై చట్టంపరంగా చర్యలు తీసుకుంటామని, అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పారదర్శకంగా చర్యలు చేపట్టాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ పార్వతి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జీవీ ముసలయ్య, డీటీ శ్రీకాంత్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో ఆర్డీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారిక లేఅవుట్లకు సంబంధించి వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా వినియోగించేందుక అవసరమైన చలానా రుసుము చెల్లించి తగిన ధ్రువీకరణ పత్రాలు పొందేవిధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

అద్దంకిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం నేత్ర దానం నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే కొలిశెట్టి మల్లికార్జునరావు(77) మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో శంకర కంటి వైద్యశాలకు చెందిన వైద్యులు డాక్టర్ చింతల్ బృందం కార్నియాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, నందిరెడ్డి శ్రీనివాసరావు, కాకర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

పంగులూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీఈవో స్వరూపారాణి హెచ్చరించారు. మండలంలోని ముప్పవరం సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈవోఆర్డీ సుమంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, సర్పంచ్ రౌతు సాంబశివరావు, కార్యదర్శి జానీ బేగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

పంగులూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో శుక్రవారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏఈ పరిశీలించారు. కొత్తగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే పంచాయతీ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, కార్యదర్శి జానీబేగం, సురేంద్ర, అనంతలక్ష్మి, ఆదాం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పాత ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు హల్‌చల్

ఇంకొల్లు,జనవరి 3,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు పాత ఎంపీడీవో కార్యాలయంలో దొంగలు పడి కొన్ని వస్తువులను అపహరించుకు పోయారు. భవనం శిథిలావస్థకు చేరుకొంది. దర్వాజాలు, కిటికీలు చెదలుపట్టి పూర్తిగా దెబ్బతిన్నాయి.దీంతో చిల్లర దొంగలు హల్‌చల్ చేస్తున్నారు.తలుపులు పగులగొట్టి అందులో విలువైన రికార్డులు తీసుకుపోతున్నారు.సీలింగు ఫ్యాన్లు సైతం అపహరణకు గురైయ్యాయి.సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

మత్తుకు అలవాటుపడి..

● గంజాయి దొరక్క
బోనోఫిక్స్‌కు బానిసలుగా దంపతులు
● అదిదొరక్క భర్తపై భార్యదాడి
● అడ్డువచ్చిన ఆరేళ్ల కూతురునీ బాదేసిన వైనం

చీరాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :స్థానిక రామనగర్‌లో ఓ భార్యాభర్త గంజాయికి బానిసలు. అయితే ప్రస్తుతం గంజాయి దొరక్కపోవడంతో బోనోఫిక్స్‌కు అలవాటుపడ్డారు. నిత్యం కలిసి మెలిసి పీల్చేవారు. అయితే ఇటీవల కాలంలో భర్త ఒక్కడే బయటకు వెళ్లి బోనోఫిక్స్ పీల్చుకుని ఇంటికి వస్తున్నాడు. అయితే బానిసగా మారిన భార్య తనకు మత్తు ఇవ్వడం లేదని భర్తపై గురువారం దాడిచేసింది. దీంతో పరస్పరం దాడులకు తెగబడ్డారు. కన్నుమిన్ను కానకుండా దాడులు చేసుకున్నారు. ఆసమయంలో అమాయకురాలైన ఆరేళ్ల కుమార్తె వీరికి అడ్డువచ్చింది. దీంతో పైశాచికంగా కుర్చీతో ఘోరంగా దాడి చేశారు. దీంతో అభం శుభం తెలియని చిన్నారి తలపూర్తిగా రక్త స్రావం అయి స్పృహ కోల్పోయింది. హుటాహుటిన వారే ఆ చిన్నారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. బోనోఫిక్స్ మత్తులో ఊగిసలాడుతున్న ఇటువంటి బానిసలకు పోలీసు యంత్రాంగం అడ్డుకట్ట వేయాల్సి ఉంది. లేకుంటే భవిష్యత్తులో ఎటువంటి ఘోరాలు చవిచూడాల్సి వస్తుందోనని ప్రజలు భీతిల్లుతున్నారు. అలాగే బోనోఫిక్స్ అమ్మకాలు జరిపేందుకు దుకాణ దారులకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది.

పొగాకు రైతుల సంక్షేమం కోసమే బోర్డు ఏర్పాటు : ఆర్‌ఎం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతుల సంక్షేమం కోసమే బోర్డు ఏర్పాటు జరిగిందని రీజనల్ మేనేజర్ బుల్లి సుబ్బారావు తెలిపారు. ఒంగోలులోని పొగాకు బోర్డు కార్యాలయంలో శుక్రవారం 49వ పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఎలాంటి విపత్తులు ఎదురైనా పొగాకు బోర్డు రైతులకు అండగా ఉంటుందన్నారు. బోర్డు ద్వారా రైతుల కోసం చేపడుతున్నత కార్యక్రమాలను వివరించారు. అనంతరం పలువురు పొగాకు రైతులు మాట్లాడుతూ సీటీఆర్‌ఐ సహకారంతో ఆధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చి పొగాకు సాగును సులభతరం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకుని విద్యలో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు అన్నారు. స్థానిక కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాయిత్రిబాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అనిత, డాక్టర్ షర్మిలంరాణి, డాక్టర్ సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.


పందిళ్లపల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఐక్య వేదిక ఆధ్వర్యంలో ..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సాయిత్రిబాయి పూలే 194వ జయంతిని స్థానిక గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గాయత్రిదేవి అధ్యక్షన ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు నగదు బహుమతులను అందించారు. పాఠశాలలోని 26 మంది మహిళా ఉపాధ్యాయులను శాలువలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు. దేవపాలన, రిటైర్డ్ హెచ్‌ఎం సీహెచ్. రామాంజనేయులు, అన్నమనేని వెంకట్రావు, జ్యోతి చంద్రమౌళి, ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, ట్రెజరర్ సీహెచ్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాంలో

చినగంజాం : మండలంలోని మున్నంవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి హెచ్‌ఎం మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు పి.హిమవంతేశ్వరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎస్.చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్టూరులో

మార్టూరు : సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం మండలంలోని వలపర్ల గ్రామంలోని నేతాజీ విద్యాసంస్థలో ఘనంగా నిర్వహించారు విద్యాసంస్థలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయినులను శాలువాకప్పి హెచ్‌ఎం షాహిరా ఘనంగా సత్కరించారు.


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ మోహనరావు, అధ్యాపకులు

క్విజ్ పోటీలలో పందిళ్లపల్లి విద్యార్థుల ప్రతిభ

వేటపాలెం(చీరాల) : బాపట్లలో సైన్స్ ఫెయిర్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన క్విజ్ పోటీలలో వేటపాలెం మండలం పందిళ్లపల్లి జెడ్‌పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి ప్రతిభను చాటారు. 7వ తరగతి చదువుతున్న పింజల నిఖిల్‌కుమార్(ప్రథమ స్థానం), పృధ్వి షణ్ముఖేశ్వర్(ద్వితీయ స్థానం)లో నిలిచారు. వారికి ప్రశంసాపత్రాలు, షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా పందిళ్లపల్లి స్కూల్ ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు, ఎస్‌ఎంసీ చైర్మన్, సభ్యులు, గ్రామస్థులు విద్యార్థులను అభినందించారు.

నిర్ణీత కాలవ్యవధిలో సమస్యలకు పరిష్కారం

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

వేటపాలెం(చీరాల), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : నిర్ణీత కాలవ్యవధిలో అర్జీదారుల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడతామని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు చెప్పారు. మండల పరిధిలోని పాపాయిపాలెంలో శుక్రవారం తహసీల్దార్ పార్వతి అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొత్తం 14 అర్జీలు వివిధ సమస్యలపై అందాయి. అందులో పట్టాదారు పాసుపుస్తకాల కోసం 10, కుల ధ్రువీకరణ కోసం 2, ఎఫ్‌లైన్ కోసం 2 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాపాయిపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

ఇంకొల్లులో

ఇంకొల్లు : మండలంలోని భీమవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో నాలుగు అర్జీలు అందాయని తహసీల్దారు వెంకటరత్నం తెలిపారు. ఒకటి దేవదాయ భూములను సర్వే చేయాలని, భూ సమస్యల పరిష్కారానికి మరో మూడు అర్జీలు అందాయన్నారు.



కశ్యాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరులో..

పంగులూరు :రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని మండల తహసీల్దార్ సింగారావు కోరారు. కశ్యాపురం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సమస్యను కోర్టుకు నివేదిస్తాం

మండలంలోని అలవలపాడు గ్రామంలో 175 సర్వే నెంబరులో గల భూ వివాదంపై కోర్టుకు తగిన నివేదికను సమర్పిస్తామని తహసీల్దార్ సింగారావు రైతులకు తెలిపారు. కోర్టువారు కోరిన సమాచార నిమిత్తం భూమిపై తగిన సర్వే శుక్రవారం నిర్వహించారు.

బైబిల్ పరీక్షలో విజేతలకు బహుమతులు

చినగంజాం, జనవరి 3(ఆంధ్రజ్యోతి) :క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బైబిల్ పరీక్షలో విజేతలైన వారికి స్థానిక అంబేడ్కర్‌నగర్‌లోని పెద్ద చర్చి వద్ద శుక్రవారం నిర్వహించిన సభలో బహుమతులు అందజేశారు. క్రిస్మస్ క్యారల్స్ నిర్వాహకులు మేకల మేషక్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో బైబిల్ పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన కడవకుదురు గ్రామానికి చెందిన కత్తి సుమంత్‌కు సత్యం హైస్కూల్ డైరెక్టర్ ఎన్. హరనాథ్‌బాబు సమకూర్చిన రూ.11వేల రూపాయిలను, రెండవ బహుమతి పొందిన అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బడుగు రిబ్కాకు ఉపాధ్యాయుడు సురేంద్ర, బ్యాంకు ఉద్యోగి అందజేసిన రూ.8 వేల రూపాయలను, మూడవ స్థానంలో నిలిచిన తొట్టెంపూడి లుదియాకు బడుగు శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె శోభారాణి అందజేసిన ఐదు వేలరూపాయలను, కడవకుదురు గ్రామానికి చెందిన డి.ఏలియా నాలుగవ స్థానం సాధించగా పాదర్తి ఆనందబాబు అందజేసిన మూడు వేల రూపాయలను, టీ.వజ్రం, జే.దయమ్మ, పీ.దీనలు ఐదో స్థానాలు సాధించగా రైల్వే ఉద్యోగి చప్పిడి చక్రపాణి, ఎం.రామస్వామిలు అందజేసిన బహుమతులను అందించారు. అనంతరం ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన బడుగు అబ్రహంలింకన్, మేడికొండ కోటేశ్వరరావులను గ్రామ పెద్దలు, అంబేద్కర్ యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ గ్రామ పెద్దలు, ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నాటి భూబాగోతాలపై నిగ్గు తేల్చండి

బాధితులకు న్యాయం చేయండి
రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యేల విజ్ఞప్తి
మార్చి నాటికి పరిష్కరించాలని మంత్రి సత్యప్రసాద్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఉమ్మడి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూదందాలు, ఆక్రమణలపై నిగ్గు తేల్చి బాధితులకు న్యాయం చేయాలని టీడీపీ శాసనసభ్యులు, ఇన్‌చార్జిలు డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరిలో రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ అధ్యక్షత జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లాకు చెందిన శాసనసభ్యులు పాల్గొని పలు అంశాలను ప్రస్తావించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా నాలుగు జిల్లాలకు ఒక ప్రత్యేక సమావేశాన్ని రెవెన్యూ శాఖ నిర్వహిస్తోంది. మంత్రి సత్యప్రసాద్‌తోపాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులంతా శుక్రవారం సమావేశంలో పాల్గొన్నారు. జిల్లా నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, టీడీపీ ఎమ్మెల్యేలతోపాటు ఇద్దరు ఇన్‌చార్జిలు హాజరయ్యారు. ఆయా నియోజకవర్గాల వారీ రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యేలు ప్రధానంగా ప్రస్తావించారు. ముఖ్యంగా గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణలపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేలు ప్రస్తావించిన సమస్యలు ఇవీ..

తొలుత కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో జరిగిన అనేక భూ ఆక్రమణల గురించి సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సీఎస్‌పురం మండలం రేగులచిలక గ్రామంలో 400 ఎకరాల భూ ఆక్రమణ జరిగితే దానిపై గత ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ చేయించకపోగా సీఎస్‌పురంలోని మొత్తం భూములపై నిషేధం విధించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హెచ్ఎంపాడు మండలం టీపీపల్లి, అగ్రహారం, హెచ్ఎంపాడు ప్రాంతాల్లో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ ప్రభుత్వంలో పంపిణీ చేయగా 1,500 ఎకరాలను నియోజకవర్గేతరులకు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై విచారణ చేయించాలని కోరారు. వెలిగండ్ల, సీఎస్‌పురం మండలాల్లో రెవెన్యూ సమస్యలను ప్రస్తావిస్తే మా వద్ద రికార్డులు లేవంటూ అధికారులు తప్పుకుంటున్నారని.. విచారణ చేయించి అసలు అవి ఉన్నాయో, లేవో తేల్చాలని కోరారు.

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మార్కాపురం ప్రాంతంలో జరిగిన భూ ఆక్రమణలకు సంబంధించి 35 రికార్డులపై విచారణ చేయించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అప్పట్లో ప్రభుత్వం అధికారులను బలి చేస్తూ అనేక మందిని సస్పెండ్ చేసిందే తప్ప ఆక్రమణలకు పాల్పడిన వారి నుంచి భూములు వెనక్కు తీసుకోలేదన్నారు. ఆ భూబాగోతాలపై తిరిగి విచారణ చేయించాలని కోరారు. భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించాలన్నా, తొలగించాలన్నా అధికారాన్ని జాయింట్ కలెక్టర్ల పరిధిలో ఉండటంతో ఇబ్బందులు కలుగుతున్నాయన్న ఆయన.. ఆర్డీవో పరిధిలోకి తేవాలని కోరారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒంగోలులో జరిగిన అనేక అక్రమాలపై తిరిగి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అప్పట్లో నిరుపేదలకు ఇంటి స్థలాల కేటాయింపులోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. అనర్హులకు స్థలాలను కట్టబెట్టారని, ప్రత్యేక విచారణ చేయించి న్యాయం చేయాలని కోరారు.

సమావేశంలో పాల్గొన్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆ రెండు నియోజకవర్గాల్లో ఉన్న ఇనాం భూముల సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా ఎనిమిది గ్రామాల పరిధిలో ఉన్న సమస్యలను వివరిస్తూ తక్షణమే రైతులకు రిజిస్ట్రేషన్‌లు జరిగేలే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పూర్తి హక్కులు ఉన్నప్పటికీ దేవదాయ భూముల పేరుతో ప్రైవేట్ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపారని చెప్పారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. వాన్‌పిక్ పేరుతో ఆ పరిధిలో లేని భూములపై రైతుల హక్కులు ఆపేశారని వాటిని పునరుద్ధరించాలని కోరారు. మరో మంత్రి స్వామి విశాఖ పర్యటనలో ఉన్నందున సమావేశానికి హాజరుకాలేదు. దీంతో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ సత్య కొండపి నియోజకవర్గంలోని పలు రెవెన్యూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితో పాటు దర్శి, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు వారి నియోజకవర్గాల్లోని సమస్యలను వివరించారు. వీటన్నింటినీ వచ్చే మార్చిలోపు పరిష్కరించాలని, మార్చి చివర్లో ఇదే తరహా సమావేశం నిర్వహిస్తామని మంత్రి సత్యప్రసాద్ రాష్ట్ర, జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.


ఎయిర్‌పోర్టులపై సమీక్ష చేస్తున్న చంద్రబాబు నాయుడు

ఒంగోలులో ఎయిర్‌పోర్టుపై అధ్యయనాన్ని వెంటనే పూర్తి చేయాలి

● సీఎం చంద్రబాబు ఆదేశం

ఒంగోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సమీపంలో ప్రతిపాదించిన ఎయిర్ పోర్టు సాధ్యాసాధ్యాలపై చేపట్టిన అధ్యయనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏడు ఎయిర్ పోర్టులు ఉండగా మరో ఏడింటి ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ఉన్న ఎయిర్‌పోర్టులలో అభివృద్ధి చేయాల్సిన అంశాలు, కొత్తగా ప్రతిపాదించిన వాటి ప్రస్తుత పరిస్థితిని అధికారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఒంగోలు ఎయిర్‌పోర్టు అంశంపై సమీక్షలో 657 ఎకరాల భూమి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ ఎయిర్ పోర్టు ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం జరుగుతున్నట్లు చెప్పారు. దానిపై స్పందించిన సీఎం చంద్రబాబు త్వరితగతిన దాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.


నియోజకవర్గాలకు పంపేందుకు ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న సిబ్బంది

6న ఓటర్ల తుది జాబితా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 6వతేదీన ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్నారు. అందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. నాలుగు నెలల క్రితం ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల కమిషన్ ఆదేశించింది. తదనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను చేపట్టారు. చేర్పులు, మార్పులు చేశారు. ఈనెల 6వతేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయ ఆవరణలో ఆయా నియోజకవర్గాల సిబ్బంది జాబితాలను తమ ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు పరిశీలన చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక వాహనాల్లో నియోజకవర్గాలకు తరలించనున్నారు. ఆర్వో తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

యువతికి కుట్టుమిషన్ పంపిణీ

మార్టూరు,జనవరి3(ఆంధ్రజ్యోతి):స్థానికంగా అమ్మ ఆశ్రమంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన పేద యువతి షేక్ ముబీనా బేగంకు శుక్రవారం ఇన్నర్ వీల్ క్లబ్ వారు కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు హబిజాన్, కార్యదర్శి వసంత శ్రీదేవి, మాజీ అధ్యక్షురాలు జాష్టి అనూరాధ ఆశ్రమం అధ్యక్షులు గుంటుపల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

రాష్ట్రస్థాయికి ఆరు ప్రాజెక్టులు ఎంపిక

ఒంగోలు విద్య, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానిక ఒంగోలు పబ్లిక్ స్కూలులో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రం పట్ల అభిలాషను పెంచాలన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించి వారి ఉన్నతికి ఉపాధ్యాయులు మార్గదర్శకులు కావాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించిన డీఈవో వారిని అభినందించారు. 38 మండలాల నుంచి మండలానికి మూడు చొప్పున 114 ప్రాజెక్టులు రావాల్సి ఉండగా 87 మాత్రమే ప్రదర్శించారు. మండల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులు జిల్లా స్థాయిప్రదర్శనకు తీసుకురాని వారికి, మండల స్థాయిలో అసలు ప్రదర్శనలను నిర్వహించని వారికి మెమోలు జారీ చేస్తున్నట్లు డీఈవో తెలిపారు. ప్రదర్శనలో ఆరు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 18 మందికి డీఈవో సర్టిఫికెట్లను అందజేశారు.

విజేతలు వీరే

వ్యక్తిగత, సామూహిక, టీచర్ ఎగ్జిబిట్లలో ఆరింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వ్యక్తిగత విభాగంలో మంగమూరు జడ్పీ హైస్కూలు విద్యార్థి పి.దివ్యశ్రీ (లిజునిలస్ మెషిన్), మార్కాపురం జడ్పీ బాలికల హైస్కూలు విద్యార్థి శ్రీలక్ష్మి కామేశ్వరి (స్మార్ట్ పోల్), గ్రూపు ఎగ్జిబిట్‌లో చిన్నారికట్ల విద్యార్థులు ఎం.సాయి, బి.వీరేంద్ర (పెన్నింగ్ ఆఫ్ హ్యూమనిటి), తమ్ములచెరువు హైస్కూలు విద్యార్థులు ఈశ్వరరెడ్డి, ఎం.శ్రీను(సోలార్‌షిప్) ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. టీచర్ ఎగ్జిబిట్‌లో పొదిలి జీహెచ్‌ఎస్ టీచర్ ఎ.మధుసూదనరావు (స్మార్ట్ ప్యాన్ మైక్రో స్కోప్), ఈదుమూడి హైస్కూలు టీచర్ కె.స్వర్ణలత (జాబిల్లి జిలుగులు) ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. వ్యక్తిగత విభాగంలో ద్వితీయ స్థానంలో ఇద్దరు, తృతీయ స్థానంలో ఇద్దరిని విజేతలుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు సైన్స్ అధికారి టి.రమేష్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



పందిళ్లపల్లిలో గ్రామ నడక కార్యక్రమంలో కూటమి నాయకులు

సమస్యల పరిష్కారం కోసం గ్రామనడక

వేటపాలెం(చీరాల), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లపల్లిలో గ్రామనడక పేరుతో శుక్రవారం కూటమికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు గ్రామంలో పర్యటించారు. గ్రామ సచివాలయం - 1 నుంచి గ్రామనడక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తాము పర్యటించిన పరిధిలోని వీధులలో సమస్యలను అక్కడివారిని అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. అలానే మన హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరిగి స్వీయనియంత్రణతో ప్రభుత్వానికి సహకరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పి. బాలచంద్ర, ఆర్.కె నాయుడు, పి. శ్రీనివాసరావు, కె. బాలసుబ్రమణ్యం, వై. బసవేశ్వరరావు, లలిత్‌కుమార్, లోకేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న విశ్రాంత ఉద్యోగులు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఇంకొల్లు,జనవరి 3,(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల బాపయ్య అన్నారు. శుక్రవారం ఇంకొల్లు శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 75 సంవత్సరాలు దాటిన 21 మంది పెన్షనర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు శాఖ అధ్యక్ష కార్యదర్శులు వై.కృష్ణమూర్తి,కరి కమలేశ్వరరావు, చీరాల ఉపఖజానా అధికారి మద్ది వెంకట సుబ్బారావు, మార్టూరు అధ్యక్ష కార్యదర్శులు కమాలుద్దీన్, చిట్టిబాబు, అద్దంకి అధ్యక్ష కార్యదర్శులు మస్తాన్,కృష్ణయ్య, గోపాలరావు, హరిబాబు, బ్రహ్మనాయుడు, ఆంధ్రప్రగతి బ్యాంకు మేనేజరు శేషయ్య, 150 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వ హిందూపరిషత్ ప్రతినిధులు

దేవాలయాల పవిత్రతను కాపాడాలి

- విశ్వ హిందూపరిషత్ చీరాల శాఖ ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాల పవిత్రకు భంగం కలిగేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని, ఈక్రమంలో పాలకులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని చీరాల విశ్వ హిందూపరిషత్ శాఖ ప్రతినిధులు అన్నారు. వచ్చే ఆదివారం విజయవాడలో హైందవ శంఖారావం బహిరంగ సభ జరుగుతున్న నేపథ్యంలో చీరాలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బోస్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన ర్యాలీ చీరాల, పేరాల, ఈపూరుపాలెం ప్రాంతాల్లో జరిగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు. ఎండోమెంట్‌ను తొలగించి ధార్మిక సంస్థలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. విజయవాడ సభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.



వాలీబాల్ పోటీలలో విజేతలతో సెయింట్‌ఆన్స్ కళాశాల ప్రతినిధులు

వాలీబాల్ పోటీలలో సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు ప్రతిభ

చీరాల, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో గుంటూరు ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన వాలీబాల్ పోటీలలో తమ కళాశాల జట్టు విన్నర్స్‌గా నిలిచిందని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు తెలిపారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను వారు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జగదీష్ బాబు మాట్లాడుతూ ఆర్‌వీఆర్ అండ్ జేసీలో జరిగిన పోటీలలో 20 జట్లతో ఆడి అంతిమంగా విన్నర్స్‌గా నిలిచారన్నారు. కార్యక్రమంలో వ్యాయాయ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజరు ఆర్‌వీ రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9 నుంచి కొమ్మినేనివారిపాలెంలో క్రికెట్ పోటీలు

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు జరుగుతాయని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలలో విజేతలకు మెదటి బహుమతిగా రూ.25,116, రెండో బహుమతిగా రూ. 20,116, మూడో బహుమతిగా రూ.15,116 అందజేస్తామని, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌కు రూ.3,116 చొప్పున అందజేస్తామని, ఎంట్రీ ఫీజు రూ.750 చెల్లించాలని కోరారు. ఈనెల 8 వ తేదీన పోటీలకు సంబంధించి డ్రా తీస్తామని, మరిన్ని వివరాలకు 8555834197, 7670949842 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

వ్యర్థాలకు నిప్పు- ప్రాణాలకు ముప్పు

- పొగతో ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు





రోడ్డుపక్కన దట్టంగా ఉన్న పొగలో నుంచి వస్తున్న వాహనదారులు (ఇన్‌సెట్లో) రోడ్డు మార్జిన్‌లో పోసిన వ్యర్థాలు

పర్చూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను తగులబెట్టే సమయంలో వచ్చే పొగ వాహనదారుల ప్రాణాలను తీస్తోంది. పర్చూరు-చీరాల ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లో గ్రామాల్లోని వ్యర్థాలను తెచ్చి పోయటంతో అవి కాస్త డంపింగ్ యార్డుల్లా మారాయి. వ్యర్థాలను తొలగించాల్సిన సిబ్బంది వాటికి నిప్పు అంటించి చేతులు దులుపు కోవటంతో సమస్య జటిలంగా మారింది. తగులబడుతున్న వ్యర్థాల నుంచి వచ్చే పొగ రోడ్డును కమ్మివేయటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దట్టమైనపొగతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం పొగ మంచుకూడా తోడు కావటంతో సమస్య మరింత జటిలంగా మారింది. దీనికి తోడు ఇదే రోడ్డులో వాడరేవు - పిడుగు రాళ్ళ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలంకార పాయంగా డంపింగ్ యార్డులు

గ్రామాల్లో చెత్త చెదారం కోసం లక్షల రూపాయల వ్యయవంతో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు(డంపింగ్ యార్డులు) వినియోగంలోకి రాక అలంకార ప్రాయంగా మారాయి. వీటిని వినియోగించేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఇది తమ పనికాదన్నట్లు వ్యవహరించటంతో పరిస్థితి ఇలా తయారైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సిలీంద్రాలతోనే శనగకు ఎండు తెగులు

- పంటమార్పిడి, విత్తనశుద్ధి విధిగా పాటించాలి
- వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



చందలూరులో ఎండు తెగులు సోకిన శనగ పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్ర వేత్తలు

పంగులూరు. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :శనగ పైరులో ఎండు తెగులు గుర్తించామని, భూమిలో సిలీంద్రాల ద్వారా ఈ తెగులు విస్తరించిందని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌వర్మ, డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో శనగ పైరుకు ఆశించిన ఎండుతెగులును శుక్రవారం లాఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ కిసోర్‌వర్మ, డాక్టర్ సృజినీరావు, కృషీవిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌లు స్థానిక రైతులతో కలసి తెగులు సోకిన శనగ పైరును పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘ కాలంగా భూమిలో ఒకే పైరు సాగు చేయడం వల్ల ఇలాంటి తెగుళ్ల ఆశించే అవకాశం ఉందన్నారు. సాగుకు ముందు విత్తన ఎంపిక, విత్తనశుద్ధి చేయడం అవసరమని సూచించారు. ట్రైకోడెర్మా విరిడీతో పాటు వేపపిండి 100 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి బాగా మగ్గిన అనంతరం దుక్కిలో వేసి దున్నడం వలన సిలీంద్రాలు నశించి పైరుకు మేలు చేస్తుందని శాస్త్ర వేత్తలు రైతులకు సూచించారు. ఈ పరిశీలనలో కె.వి.సుబ్బారావు, రైతులు పెంట్యాల రామలింగస్వామి, ఎర్రమనేని వెంకటరావు, చిట్టిబాబు, హనుమంతరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ధర్నాలో సీఐటీయూ నేతల డిమాండ్

చీరాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ పరిధిలో పని చేస్తున్న మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ సిబ్బంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కావడంతో పనికి తగిన వేతనం అందడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. అలాగే వారి సర్వీసును ప్రాధాన్యంగా తీసుకుని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదనపు పనులకు టీఏ, డీఏలు అందించాలని కోరారు. అనంతరం కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. బాబురావు, చిమటా వీరాస్వామి, చాంద్‌బాషా, నాగేశ్వరరావు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకిలో..

అద్దంకిటౌన్ : ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ రవీంద్రను కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు ఉసురుపాటి సామేలు, ఉపాధ్యక్షుడు పెద్ద మార్కు, కార్యదర్శి వసంతరావు(జాన్), కమిటీ సభ్యులు ఎం. రమాదేవి, ఎం. ప్రేమ్ , వై. అనూష తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి శ్రీకారం

- ఎమ్మెల్యే ఏలూరి చొరవతో పనులు



పర్చూరులోని చెరువు కట్ట నుంచి హిందూ శ్మశానం మీదుగా నిర్మాణం చేస్తున్నడ్రైనేజ్ పనులు

పర్చూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఏలూరి చొరవతో గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కడ చూసినా మురుగు నీరే దర్శనమిస్తోంది. దీనికి ప్రధాన కారణం డ్రైనేజీలు లేకపోవటం, ఉన్న చోట వాటిని ఆక్రమించుకొని కట్టడాలు నిర్మించడంతో సమస్య ఏర్పడుతోంది. ఈ సమస్యపై స్పందించిన ఏలూరి సాంబశివరావు యుద్ధప్రాతిపదికన కాలువల ఏర్పాటుతోపాటు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ అధికారులు డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరు చెరువు కట్ట నుంచి హిందూ శ్మశానం మీదుగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

విపత్తుల సమయంలో జాగ్రత్తలు పాటించాలి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విపత్తుల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడం వలన సులభంగా బయట పడవచ్చని ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ ముఖేష్ అన్నారు. విజయవాడ కార్యాలయం ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ప్రదర్శన ద్వారా పలు సందేహాలను నివృత్తి చేశారు. అలాగే పాఠశాలకు ప్రథమ చికిత్స కిట్, అవగాహన సీడీని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుధావాణి, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, బోధన బోధనేతర, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

శనగల డబ్బులు ఇప్పించండి

- తహసీల్దార్‌కు రైతుల వినతి

యద్దనపూడి,(మార్టూరు)జనవరి3(ఆంధ్రజ్యోతి):శనగలు కొనుగోలు చేసిన గోగుల నాగరాజు అనే వ్యక్తి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని శుక్రవారం రైతు సంఘం నాయకులు, బాధిత రైతులు తహసీల్దారు రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.యద్దనపూడి మండలంలోని యద్దనపూడి, పూనూరు, గన్నవరం, చింతపల్లిపాడు గ్రామాలకు చెందిన 14 మంది రైతుల దగ్గర గోగుల నాగరాజు అనే వ్యక్తి శనగలను కొనుగోలు చేశారు.వారందరికీ 1 కోటి 14 లక్షల రూపాయలను ఇవ్వాల్సి ఉండగా నాగరాజు ఇంతవరకు వారికి డబ్బులు ఇవ్వలేదు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నాగరాజు స్థానిక యలవర్తి కోల్డ్‌స్టోరేజీలో గుమస్తాగా పనిచేసే సమయంలో అతనికి రైతులతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాలతో రైతులు అతనికి శనగలను అమ్మారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని,నాగరాజు నుండి తమకు డబ్బులు ఇప్పించాలని కోరుతూ రైతులురైతుసంఘం నాయకులు ఆ వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, గొట్టిపాటి రాంబాబు,పెరవల్లి శ్రీనివాసరావు,కర్లపూడి సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.

గోపి కుటుంబసభ్యులను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి

అద్దంకి,జనవరి3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధేనువకొండలో ఇటీవల మృతి చెందిన మండల తెలుగు యువత అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపి కుటుంబసభ్యులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. గోపి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, కఠారి నాగేశ్వరరావు, చాగంటి రాజేంద్ర ప్రసాద్, బండారుపల్లి శ్రీనివాసరావు, మలాది నటరాజ్, అన్నాబత్తిన అజయ్‌బాబు, రంగా, రమణ, అంజయ్య తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

నేడు మంత్రి పర్యటన వివరాలు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం అద్దంకి నియోజకవర్గంలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10.30 గంటలకు బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు, 11.30 గంటలకు సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మధ్యాహ్నం 12 గంటలకు సంతమాగులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే రెవెన్యూ సదస్సులకు మంత్రి రవికుమార్ హాజరు కానున్నారు.

పలువురిని పరామర్శించిన రవికుమార్

మేదరమెట్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. గుడిపాడులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. శుక్రవారం పి. గుడిపాడులో అనారోగ్యంతో మృతి చెందిన రావూరి సందీప్ ఇంటికి వెళ్లి సందీప్ తల్లి స్వరూపను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఒదార్చారు. పలతోటి అంజయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గ్రామ తెలుగుదేశం నాయకులు మందా నాగేశ్వరరావు, తొట్టే రవీంద్ర, మందా ఆమోస్‌తో పాటు తెలుగుదేశం నాయకులు ఉన్నారు.

నేడు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తున్నదని బల్లికురవ కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధాకర్ తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రిన్సిపాల్ తెలిపారు.



మహిళా కానిస్టేబుల్‌ను సేవారత్న అవార్డుతో సత్కరిస్తున్న సీఐ బండారు సురేష్

జై జపాలి ట్రస్ట్ సేవలు అభినందనీయం

- టీడీపీ సీనియర్ నేత సీతారామయ్య

ఆదిపూడి(పర్చూరు), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : జై జపాలి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామాభివృద్ధితోపాటు, ప్రజలకు సేవ చేయటం అభినందనీయమని టీడీపీ సీనియర్ నేత, కాపుసంఘం నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య అన్నారు. కారంచేడు మండలం ఆదిపూడి గ్రామంలోని పార్కులో ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వంతోపాటు, ప్రజల సహకారం ఉంటే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. పల్నాడు జిల్లా నర్సరావుపేట స్పెషల్ బ్రాంచ్ సీఐ బండారు సురేష్ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా గ్రామంలోని శ్మశాన వాటిక అభివృద్ధితో పాటు,పార్కును కూడా ఏర్పాటు చేశామన్నారు. దీంతోపాటు, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక చేయూత నందించి వారి ఉజ్వల భవిష్యత్‌కు జై జపాలి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. అనంతరం గుంటూరు జిల్లా, పెదకాకాని పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణకుమారిని సేవారత్న బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బండారు వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ రమణారావు,హరిదాసుల మాదవరావు, కాసా శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, కాల్వ రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబసభ్యులతో సాంఘిక సంక్షేమ అధికారి రాజ దెబోరా, పలు మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లు

వెల్ఫేర్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం

చినగంజాం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ గుండెపోటుతో మృతిచెందిన ఆసోది నరేంద్రబాబు కుటుంబాన్ని శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖాధికారి రాజ దెబోరా పరామర్శించారు. జిల్లా పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌లు అందజేసిన ఆర్థిక సాయం రూ.64,400లను ఆమె నరేంద్రబాబు కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుబ్బారావు, చీరాల, రేపల్లె ఏఎస్‌డబ్ల్యూవోలు సైదారెడ్డి, సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యూవో, వెల్ఫేర్ రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, చినగంజాం, పలు మండలాలకు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పంగులూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని భగవాన్‌రాజుపాలెం ఫ్లై ఓవర్ దిగువన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు అందించిన సమాచారం మేరకు ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న మారుతీ జన్ కారు ముందు వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదే వరుసలో ముందు వెళుతున్న ఆటోతో పాటు స్కూటర్‌ను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న బొమ్మనంపాడు గ్రామానికి చెందిన కస్తూరి నాగేశ్వరరావు కారు టైరు కిందపడి మృతిచెందాడు. కారు వేగంగా ఢీకొనడంతో ఆటో తిరగబడటంతో అందులో పంగులూరు నుంచి మార్టూరు కూరగాయల మార్కెట్‌కి వెళుతున్న పొన్నం శ్రీనివాసరావుకు కాలు విరిగింది. బేతాల పెదేడుకొండలు, నందవరపు పీరు సాహెబ్, పెదమస్తాన్, శ్రావణం మస్తానమ్మలకు గాయాలయ్యాయి. ఎస్ఐ వినోద్‌బాబు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మార్టూరుకు,కాలు విరిగిన శ్రీనివాసరావును నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. నాగేశ్వరరావు (70) మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రేణంగివరం ఎస్ఐ. వినోద్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

చీరాలటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుని ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి రాజమండ్రి జిల్లా సీతానగరం మండలం బొబ్బర్లంకకు చెందిన తన్నీరు శ్రీనివాసరావు(54) దుర్మరణం చెందాడు. చినగంజాం మండలం కడవకుదురు వద్ద గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. చీరాల రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని శుక్రవారం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి


మేదరమెట్ల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో అత్యవసర రన్‌వేపై మోపెడ్‌పై వెళ్తున్న యువకుడిని కారు ఢీకొంది.ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం జె. పంగులూరు మండలం రేణింగివరంకు చెందిన అన్నపురెడ్డి హరికృష్ణ (29) మోపెడ్‌పై రేణంగివరం వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో హరికృష్ణ మృతి చెందాడు. మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు పై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

బల్లికురవ. జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొమ్మినేనివారిపాలెం అద్దంకి మేజర్ కాలువ బ్రిడ్జి వద్ద బైకు అదుపు తప్పి పడిపోయింది. ఈప్రమాదంలో శంకరవరప్పాడుకు చెందిన హనుమంతురావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. అద్దంకి మండలం శంకవరప్పాడుకు చెందిన హనుమంతురావు బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెంకు శుక్రవారం బైకుపై వస్తుండగా అద్దంకి మేజర్ కాలవ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి బైకు అదుపు తప్పి పడింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హనుమంతురావును 108లో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

వేటపాలెం(చీరాల), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును శుక్రవారం వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పట్టుకున్నారు. ఆ ట్రాక్టరును ఇసుకతో సహా స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 3,238 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.813 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శనివారం 4 జనవరి 2025



నేడే ముగ్గుల పోటీలు

ఒంగోలు, కనిగిరిలో నిర్వహణ

ఆంధ్రజ్యోతి ఏటా సంక్రాంతికి ముందు నిర్వహించే ముత్యాల ముగ్గుల పోటీలు శని, ఆదివారాలలో జరగనున్నాయి. తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ప్రకాశం జిల్లా ఒంగోలు, కనిగిరి, గిద్దలూరులలో నిర్వహిస్తున్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు..గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ప్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో ఈ కేంద్రాల్లో జరుగుతాయి.

ఒంగోలులో ఆర్టీసీ బస్టాండుకు సమీపంలో ఉన్న వీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాల, కనిగిరిలో పామూరు రోడ్డులో ఉన్న అమరావతి గ్రౌండ్స్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. గిద్దలూరులో ఆదివారం పోటీలు జరుగుతాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గురిలో ఒకరిని జిల్లా విజేతగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదీన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. ఒంగోలులో జరిగే పోటీలకు శ్రీసరస్వతి విద్యా సంస్థలు, కనిగిరిలో జరిగే పోటీలకు అమరావతి ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్సెస్ (గుంటూరు), ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి లోకల్ స్పాన్సర్స్‌గా వ్యవహరిస్తారు.

- ఒంగోలు, ఆంధ్రజ్యోతి

విద్యుత్ శాఖ వార్షిక ఆదాయ నివేదికపై 7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

నెల్లూరు (జడ్పీ), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖ 2025-26 ఏడాది ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై 7, 8 తేదీలలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ విజయన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రెండు రోజుల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి 2 నుంచి 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని పేర్కొన్నారు. కర్నూలు నుంచి ఉన్నతాధికారులు టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే అభిప్రాయ సేకరణకు జిల్లాలోని అన్ని డివిజన్ల వినియోగదారులు వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని హాజరు కావాలని ఆయన కోరారు.

ఏడాదైందే..

హామీ ఏమైంది!?

- ఆంధ్ర తీరంలోకి తమిళ బోట్ల చొరబాటును నియంత్రించడంలో వైఫల్యం
- గతేడాది కేంద్ర మంత్రి దృష్టికి సమస్య
- పరిష్కారంలో చొరవ చూపని పాలకులు
- హద్దులు దాటుతున్న తమిళ మత్స్యకారులు
- మత్స్య సంపదను కొల్లగొడుతున్న వైనం

తమిళనాడుకు చెందిన హైస్పీడ్ బోట్లు అంటేనే మన మత్స్యకారులు హడలిపోతున్నారు. ఆ రాష్ట్రానికి చెందిన ఐదారు స్పీడ్ బోట్లు ఒకేసారి మన తీరంలోకి చొచ్చుకువచ్చి మత్స్యసంపదను కొల్లగొట్టడం, అడ్డువచ్చిన వారిపై దాడులు చేయడం పరిపాటిగా మారింది. ఈ సమస్య తెలుగు, తమిళ మత్స్యకారుల మధ్య కొన్నేళ్లుగా నడుస్తోంది.



బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌లో గతేడాది జనవరి 1న మత్స్యకారులకు చెక్కు అందజేస్తున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలా (ఫైల్)

అయితే..

2024, జనవరి 1వ తేదీన అప్పటి కేంద్ర మత్స్య, పాడిపరిశ్రమ, పశుసంవర్థక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా సముద్రతీరంలో ఫిషింగ్ హార్బర్ల స్థితిగతులు, మత్స్యకారుల జీవనవిధానం, మౌలిక సదుపాయాల కల్పన కోసం చేపట్టిన సాగర్ పరిక్రమ పర్యటనలో భాగంగా సముద్ర మార్గాన బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌గా వచ్చారు. ఆయన వెంట మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నీతూ కుమారి, కేంద్ర మత్స్య శాఖ అధికారులూ ఉన్నారు. మత్స్యకారులతో వారు ముఖాముఖి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమిళనాడులోని కడలూరు నుంచి మత్స్యకారులు హైస్పీడ్ మోటార్ల బోట్లలో వచ్చి ఇక్కడి మత్స్యసంపదను దోచుకెళ్తున్నారని, ఎదురిస్తే దాడులు చేస్తున్నారంటూ స్థానిక మత్స్యకారులు ఏకరువు పెట్టారు. దీంతో కేంద్రమంత్రి ఇరు రాష్ట్రాల అధికారులతో చర్చించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో తమ సమస్య పరిష్కారం అవుతుందని అప్పట్లో మత్స్యకారులు సంబరపడ్డారు. అయితే, ఏడాది దాటినా హామీ నెరవేరలేదు. దీనిపై కనీసం చర్చ కూడా జరగలేదు. కేంద్ర మంత్రి రాకకు 2 నెలల ముందు తమిళ బోట్లను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బోటును అద్దెకు తీసుకుంది. అయితే, తమిళ బోట్ల హైస్పీడ్‌కు ఈ బోటు సామర్థ్యం చాలకపోవటంతో తిరిగి ఇచ్చేశారు. వాస్తవంగా తమిళ జాలర్లు 500 హెచ్‌పీ హైస్పీడ్ మోటార్లతో ఉన్న బోట్లతో వస్తుండటంతో అంతటి సామర్థ్యం ఉన్న బోట్లు మన జాలర్ల వద్ద లేకపోవటంతో తమిళ బోట్ల అక్రమ చొరబాటును ఎదుర్కోలేక పోతున్నారు. తమిళనాడులో మత్స్య కారుల ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి అడ్డు చెప్పలేక పోతోంది. దీంతో తమిళ హైస్పీడ్ బోట్లు వచ్చి తరచూ ఆంధ్రతీరంలో చొరబడి మత్స్య సంపదను దోచుకునిపోవటమేగాక ఇక్కడ వలలు, బోట్లను ధ్వంసం చేస్తూ దాడులు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమీ చేయలేక పోతున్నాయి. ఆంధ్ర జాలర్లే హైస్పీడ్ బోటును కొనుగోలు చేద్దామనుకుంటే అంత ఖరీదు భరించ లేకపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం సబ్సిడీ ఇస్తే మిగతా తామే భరించి హైస్పీడ్ బోట్లు కొనుగోలు చేసుకుంటామని మత్స్యకారులు చెబుతున్నారు.

ఇలా చేస్తే..

కేంద్రప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి రెండు రాష్ట్రాల మత్స్యకార సంఘాల నాయకులతో సమావేశమై సముద్రతీరంలో చేపలవేటకు ఉన్న పరిమితులు, నిబంధనలు వివరించాలి. మత్స్య శాఖ, ప్రభుత్వ నిభంధనల మేరకు తీర ప్రాంతానికి 10 కి.మీ దూరంలో పెద్ద బోట్లు కలిగిన వారు చేపలవేట సాగించుకోవచ్చనే నిబంధన అమలు జరిగేలా చూడాలి. దీనిని ఎవరు అతిక్రమించినా కేంద్రమే చర్యలు తీసుకోవాలి.

- తమిళనాడు ప్రభుత్వం కూడా నిబంధనల మేరకే వేట కొనసాగించాలని ఆ రాష్ట్ర మత్స్యకారులకు తెలపాలి. వాటిని అతిక్రమిస్తే ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు వివరించి కఠినంగా వ్యవహరించాలి.
- ఏపీ ప్రభుత్వం కూడా తీర ప్రాంతానికి 10 కి.మీలోపు ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు చేపట్టాలి. వాటిని కట్టడి చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని నియమించుకోవాలి. అలాగే హైస్పీడ్ ఇంజన్లు ఉన్న బోట్లను కొనుగోలు చేసి వాటి ద్వారా ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు చేపట్టాలి. లేదా స్థానిక మత్స్యకారులకే ఎక్కువ సబ్సిడీపై హైస్పీడ్ బోట్లు ఇచ్చి మత్స్యకారులు, మెరైన్ పోలీస్‌లు సంయుక్తంగా వాటిని ఎదుర్కొనేందుకు తగిన శిక్షణ ఇవ్వాలి.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

కేంద్రం చొరవ తీసుకోవాలి



తమిళ బోట్లు ఆంధ్రతీరానికి వచ్చి మత్స్యసంపదను దోచుకుపోవటం, ఇక్కడ వలలు, బోట్లు ధ్వంసం చేయడం, అడ్డుకునేవారిపై దాడులు చేయటం వంటి సమస్యపై కేంద్రం చొరవ తీసుకుని పరిష్కరించాలి. అలాగే స్థానిక మత్స్యకారులు హైస్పీడ్ బోట్లు కొనుగోలు చేసుకునేందుకు కేంద్రం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం సబ్సిడీ ఇస్తే మిగతాది స్థానిక మత్స్యకారులు భరించి కొనుగోలు చేసుకుంటారు.

- కొండూరు పోలిశెట్టి, ఆఫ్కాబ్ రాష్ట్ర మాజీ చైర్మన్

ఎదుర్కోవాలంటే భయపడుతున్నాం



ఆంధ్ర తీరానికి తమిళబోట్లు చొరబడి మత్స్యసంపదను దోచుకు పోతున్నా వారిని ఎదుర్కొనే ధైర్యం లేక భయపడుతున్నాం. వారి బోట్ల స్పీడ్‌కు మా బోట్లపై వెళితే వాటిని ఢీకొట్టి నష్టపరుస్తున్నారు. దీంతో తమిళ బోట్లు వస్తున్నాయని తెలిసి కూడా ఎదుర్కోలేక పోతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవతీసుకుని సమస్యను పరిష్కరించాలి.

- అలారి సోమయ్య, మత్స్యకారుడు, పాతపాలెం, బోగోలు మండలం

ఎన్నో ఏళ్ల జిల్లా వాసుల కల నెరవేర బోతోంది. దగదర్తి వద్దే విమానాశ్రయం ఏర్పాటుకు ఇప్పటికే అడుగులు వేసిన కూటమి ప్రభుత్వం తాజాగా పనులపై కీలక ఆదేశాలు వెలువడ్డాయి. కేంద్ర పౌర విమానాయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎయిర్‌పోర్టు అధికారులతో సీఎం చంద్రబాబు శుక్రవారం సమావేశమై, పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

కల నెరవేర్చే దిశగా..

ఆశలు రేపుతున్న దగదర్తి విమానాశ్రయ నిర్మాణం

కేంద్ర మంత్రి, ఎయిర్‌పోర్టు అధికారులతో సీఎం సమీక్ష

పనులు వేగవంతం చేయాలని చంద్రబాబు ఆదేశం


నెల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : దగదర్తి విమానాశ్రయం పనులను పట్టాలెక్కించడానికి కృత నిశ్చయంతో ఉన్న సీఎం చంద్రబాబు శుక్రవారం ఆ అంశంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించబోయే ఏడు విమానాశ్రాయాలలో దగదర్తి విమానాశ్రయం ఒకటి. 2014-19లో అప్పటి తెలుగుదశం ప్రభుత్వం ఈ విమానాశ్రయం నిర్మించడానికి అన్ని అనుమతులు సాధించింది. 1379 ఎకరాల్లో విమానాశ్రయం నిర్మించాలని అప్పట్లో నిర్ణయించ గా అందులో 635 ఎకరాల భూసేకరణ తెలుగుదేశం ప్రభుత్వంలో నే పూర్తి చేసింది. మరో 745 ఎకరాలు సేకరించాల్సి ఉంది. అయితే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం విమానాశ్ర య నిర్మాణాన్ని అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే దగదర్తిలో విమానాశ్రయం నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని ఎన్నికల ప్రచార సభల్లో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం దగదర్తి విమానాశ్రయ పనులు ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఈ ప్రాజెక్టుపై కీలక చర్చ సాగింది. నెల్లూరు జిల్లాకు బీపీసీఎల్ రిఫైనరీ వస్తోంది. వీటికితోడు ఈ జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని, రెండు ఓడరేవులు కలిగిన నెల్లూరు జిల్లాలో కార్గో విమానాలకు కూడా అనువైన విమానాశ్రయం అవుతుందని సీఎం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో విమానాశ్రయాల్లో ప్రైవేటు విమానాల పార్కింగ్ అవసరాలు పెరుగుతాయని, దగదర్తి విమానాశ్రయ నిర్మాణంలో ఆ విషయాన్ని కూడా గుర్తుపెట్టుకొని రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే శ్రీసిటీ సెజ్‌లో ఎయిర్ స్ట్రిప్ తెచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు.



దగదర్తి మండలం దామవరం వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు ఆవిష్కరించిన శిలాఫలకం



యూటర్న్ ప్రమాద నివారణ (యూటర్న్ యాక్సిడెంట్ ప్రివెన్షన్)



విద్యార్థుల **పేర్లు :** సీహెచ్.దీక్ష, ఎస్‌కె.కరిష్మా, **తరగతి :** 9వతరగతి, **గైడ్ టీచర్ :** అమరావతి **పాఠశాల :** ప్రభుత్వ ట్రైబుల్ వెల్ఫేర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల, గొలగమూడి, వెంకటాచలం మండలం. **ఉపయోగం:** పర్వతరోడ్లు, వంపులు, కొండలు, యూ ఆకార మలు పులు ఉన్న రోడ్లలో ప్రమాదాలను నివారించవచ్చు. ఆయా రోడ్లపై డ్రైవింగ్ చేసేవారికి ఇతర వైపుల నుంచి వచ్చే వాహనాలు కనిపించవు. ప్రతి ఏడాది వేలాదిమంది ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి. ఏ వ్యక్తి ఆపరేట్ చేయనవసరం లేకుండా ఆటోమేటిక్‌గా దీన్ని వినియోగించవచ్చు. క్లిష్టమైన ప్రదేశాల్లో సెన్సార్‌లు దెబ్బ తినకుండా రక్షించడానికి అన్ని ఏర్పాట్లు ప్రాజెక్ట్‌లో ఉన్నాయి. అలాగే వాహనం సంఖ్య, వేగాన్ని గుర్తించే వ్యవస్థతోపాటు ప్రకృతి వైపరిత్యాలు సంభవిస్తే ప్రమాదాలు జరగకుండా బజర్ విధానంతో అప్రమత్తం చేస్తుంది.

ఆవిష్కరణ అదిరె..!

బాల మేధావుల సృజన

వినూత్న ప్రాజెక్టుల రూపకల్పన

వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న నమూనాలు

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఆరు ప్రాజెక్టుల ఎంపిక



మదిలో మొలిచిన ఆలోచనలకు సృజనను జోడించి సమాజానికి ఉపయోగపడే చక్కటి ఆవిష్కరణలకు బాల శాస్త్రవేత్తలు శ్రీకారం చుట్టారు. నిత్యం తాము చూస్తున్న సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా అడుగులు వేశారు. ఇందుకు ఉపాధ్యాయుల ప్రోత్సాహం తోడైంది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆర్‌ఎస్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం సదరన్ ఇండియన్ పేరుతో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. అందులో వివిధ పాఠశాలల విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. పెద్దలను సైతం ఆలోచింపజేసేలా ఉన్న ఆ ఎగ్జిబిట్స్‌తో అధికారులు, తల్లిదండ్రుల ప్రశంసలు అందుకున్నారు. కాగా, జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన 114 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శనకు ఉంచారు. వీరిలో ప్రతిభ చూపిన 6 ప్రాజెక్ట్‌లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

6

ఖాకీ పరీక్షలకు సగం మందే!

కానిస్టేబుల్ ఎంపికలకు అభ్యర్థులు దూరం

నెల్లూరు(క్రైం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలపై అభ్యర్థులు ఆసక్తి చూపడం లేదు. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో గత నెల 30 నుంచి అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు సుమారు 600 మంది పరీక్షలకు హాజరయ్యేలా అధికారులు హాల్‌టికెట్లు జారీ చేశారు. అయితే ప్రతి రోజూ సగం మంది ఈ ఫిజికల్ టెస్ట్‌కు గైర్హాజరవుతున్నారు. నాలుగు రోజులుగా జరుగుతున్న పరీక్షలకు 2227 మంది అభ్యర్థులకుగాను 1127 మంది మాత్రమే హాజర య్యారు. 1090 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

అభ్యర్థుల హాజరు ఇలా...

తేదీ	అభ్యర్థుల సంఖ్య	హాజరైన వారు	గైర్హాజరు
డిసెంబరు 30	600	298	302
డిసెంబరు 31	600	275	325
జనవరి 2	600	328	272
జనవరి 3	417	226	191
మొత్తం	2217	1127	1090

● రెండేళ్ల తర్వాత...

గత వైసీపీ ప్రభుత్వం 2022వ సంవత్సరంలో కానిస్టేబుల్ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 జనవరి 22న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. కొద్ది రోజులకే ఫలితాలు విడుదల చేసినా అప్పటి నుంచి ఫిజికల్ టెస్ట్ నిర్వహించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాటి ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహిస్తోంది. ప్రిలిమినరీ పరీక్షలకు 20,352 మంది జిల్లా నుంచి హాజరుకాగా వారిలో 3855 మంది పురుషులు, 835 మంది మహిళలు ఫిజికల్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. అయితే వారిలో సగం మంది కూడా దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొనకపోతుండటం గమనార్హం.

● వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే...

వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో చేసిన జాప్యం కారణంగానే కానిస్టేబుల్ అభ్యర్థులు ఫిజికల్ టెస్ట్‌లకు హాజరుకావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రిలిమినరీ పరీక్షల్లో విజయం సాధించిన అభ్యర్థులు ఆ వెంటనే దేహదారుఢ్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రూ.వేలకు వేలు ఫీజులు చెల్లించి ప్రత్యేక ట్రైనర్ల వద్ద శిక్షణ పొందారు. అలాగే మెయిన్ పరీక్షలపైనా దృష్టి సారించారు. కానీ, ఏళ్లు

(మిగతా 6లో)



కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం!

- నేటి నుంచి అమలుకు ఏర్పాట్లు
- డొక్కా సీతమ్మ పేరుతో పథకం పునరుద్ధరణ

6



వేణుగోపాలుడికి శ్రీరామ పట్టాభిషేకం

నెల్లూరులోని మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి స్వామి వారికి శ్రీరామ పట్టాభిషేకం అలంకారం జరిగింది. అలాగే, తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో శ్రీవారికి రాజమన్నార్ అలంకారం జరిగింది. రెండు చోట్ల అళ్వార్ల ఘోష్టి, దివ్యనాలాయిర ప్రబంధ ఘోష్టి గానం, శాత్తుమురై జరిగాయి. ఉదయం గోదాదేవికి ధనుర్మాస పూజలు జరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



ఘనంగా గోదాదేవికి పూజలు

పెంచలకోన క్షేత్రంలో ధనుర్మాస శుక్రవారం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణలతో ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో క్షేత్రోత్సవం నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)



ఆవిష్కరణ అదిరె..!

- బాల మేధావుల సృజన
- వినూత్న ప్రాజెక్టుల రూపకల్పన
- వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న నమూనాలు

నెల్లూరు (విద్య), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ఆర్ఎస్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సదరన్ ఇండియన్ పేరుతో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మానవాళికి ఉపయోగ పడేలా సైన్స్ పరిశోధనలు విస్తృతంగా జరగాలని, దీనికి పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పునాదులు వేసి వారిని ఉత్తమ వైజ్ఞానికులుగా తీర్చిదిద్దాలని ఆమె పిలుపునిచ్చారు. ఆధునిక, సాంకేతిక రంగాల్లో దేశం అద్భుత ఫలితాలు సాధిస్తోందని, కలుషితమైన వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఖగోళ దర్పణాన్ని, విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలను అధికారులు సందర్శించి విద్యార్థులను అభినందించారు.

● సాయంత్రం జరిగిన ముగింపు వేడుకల్లో డీఈవో బాలాజీరావు పాల్గొని ప్రసంగించారు. నేటి పోటీ ప్రపంచంలో ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని, వీటిని అందిపుచ్చుకునేలా విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వం అందించే మౌలిక సదుపాయాలను సరైన రీతిలో సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమంగా ఎదగాలన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమాల్లో సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, జిల్లా సైన్స్ అధికారి కరుణాకరరెడ్డి, డిప్యూటీ ఈఓ జానకిరామయ్య, ఎంఈఓ మురళీధర్, జడ్జీలుగా వ్యవహరించిన వీఎస్‌యూ ప్రొఫెసర్స్ డా ఎస్‌బీ.సాయినాద్, డాక్టర్ పి.గోపీకృష్ణ, డాక్టర్ ఎ.శివశంకరరెడ్డి, డాక్టర్ త్రివేణి, డాక్టర్ యూ.హుస్సేనయ్య, డీకేడబ్ల్యూ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జె.కవిత, ఉత్తమ ఉపాధ్యాయులు నెల్లూరు ఫణికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





ప్రదర్శనలు పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, డీఈవో బాలాజీరావు తదితరులు

ప్రదర్శనలో సైన్స్ నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విజేతలతో అధికారులు

రాష్ట్రపోటీలకు ప్రాజెక్టుల ఎంపిక

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన 114 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శనకు ఉంచారు. వీరిలో ప్రతిభ చూపిన 6 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వ్యక్తిగత విభాగంలో ఇందుకూరుపేట మండలం కొమరిక జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 9వతరతి విద్యార్థి వైవీ.షణ్ముక్ తయారుచేసిన గ్లాసెస్ ఫర్ బ్లైండ్ పీపుల్, రాపూరు మండలం కండలేరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ 9వ తరగతి విద్యార్థిని తయారు చేసిన ప్రాక్షన్ డిస్క్ ప్రాజెక్టులు, గ్రూప్ విభాగంలో వెంకటాచలం మండలం గొలగమూడి ఎస్‌టీ ఆశ్రమ ఉన్నత పాఠశాల 9వతరగతి విద్యార్థినులు సీహెచ్.దీక్షిత, ఎస్‌కె.కరిష్మాలు తయారు చేసిన యూ టర్న్ యాక్సిడెంట్ ప్రివెన్షన్, టీపీగూడూరు మండలం కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం 10వతరగతి విద్యార్థినులు బి.కీర్తి శ్రీ, డి.రాజశ్రీ లు తయారు చేసిన అప్లికేషన్ ఆఫ్ ట్రిగ్నోమిట్రీ ఇన్ రియల్ లైఫ్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. అలాగే ఉపాధ్యాయుల విభాగంలో వెంకటాచలం మండలం గొలగమూడి ఎస్‌టీ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని పి.అమరావతి తయారు చేసిన రెయిన్ డ్రాప్ సెన్సార్, ఉలవపాడు మండలం వీరంపల్లి ఏపీఎంఎస్ ఉపాధ్యాయిని ఎస్.బింధుమాదవి తయారు చేసిన సీ చేంజ్ కోర్‌వేర్ ప్రాజెక్టులు ఉత్తమంగా నిలిచి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించాయి. వీరంతా త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

త్రికోణమితి అప్లికేషన్

విద్యార్థుల పేర్లు : బి.కీర్తిశ్రీ, బి.రాజశ్రీ

తరగతి : 10వతరగతి

గైడ్ టీచర్ : కామాక్షి

పాఠశాల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం (కోడూరు, సర్వేపల్లి)

టెంపుల్, టవర్, బిల్డింగ్, పోల్స్ తదితర ఎత్తైన వాటిని, వస్తువులను త్రికోణమితి అప్లికేషన్ ద్వారా కొలవవచ్చు. మూడు కోణాలతో కోణాలను, లెంగ్త్‌స్‌తో కూడిన సమస్యలను పరిష్కరించగలిగిన సామర్థ్యం దీనికి ఉంది. కాంతి త్రిభుజం యొక్క కోణం లేదా అదే సారూప్య త్రిభుజం యొక్క భుజాల మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునేలా దీన్ని రూపకల్పన చేశాం. ఎత్తులను కొలవడం, నిర్మాణాలు చేపట్టడం, ఖగోళశాస్త్రం, నావిగేషన్‌లో, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, వీడియో గేమ్‌లలో కూడా ఈ ప్రాజెక్టులోని అంశాలను ఉపయోగించి సమస్యలు పరిష్కంచవచ్చు. ఈ ప్రాజెక్ట్ ఎన్నో కొత్త ఆవిష్కరణలకు దోహదం చేస్తుంది.



రోబోట్‌ను అనుసరించే అడ్డంకి (స్మార్ట్ ట్రాలీ)

విద్యార్థి పేరు: జి.డింపుల్ కార్తీక్

తరగతి : 9వతరగతి

గైడ్ టీచర్: ఎన్.కామాక్షి

పాఠశాల : జడ్పీహెచ్ఎస్, పెనుబల్లి, బుచ్చిరెడ్డిపాళెం

రోబోట్‌ను నివారించే అడ్డంకి అనేది పూర్తిగా స్వయం ప్రతిపత్తి కలిగిన రోబోట్. ఇది కదిలేటప్పుడు ఎదుర్కొనే అడ్డంకిని నివారించగలదు. సరళంగా ఇది ముందుకు సాగుతున్నప్పుడు అడ్డంకిని ఎదుర్కొన్నప్పుడు స్వయం చాలకంగా ముందుకు సాగడం ఆపి ఒక అడుగు వెనక్కు వేస్తుంది. అడ్డంకి ముందుగా ఏదైనా సమీపంలోని వస్తువు కోసం శోధిస్తుంది. ఒక వస్తువుని కనుగొని దాని దూరాన్ని కొలవడానికి అల్ట్రాసోనిక్ సెన్సార్‌ను ఉపయోగిస్తుంది. బ్యాటరీ, మోటర్‌పై కదిలే ఈ రోబోను సులభమైన రీతిలో వినియోగించవచ్చు. ఇది రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, విమానాశ్రయాల్లో స్మార్ట్ లగేజీ ట్రాలీగా ఉపయోగపడుతుంది.



మురుగునీటి శుద్ధి (వేస్ట్‌వాటర్ ఫిల్ట్రైజేషన్)

విద్యార్థి పేరు: ఎం.పవిత్ర

తరగతి: 8వతరగతి

గైడ్ టీచర్ : ఆర్.బాబూరావు

పాఠశాల: జడ్పీహెచ్ఎస్ ఇనుకుర్తి, పొదలకూరు మండలం

నీటి శుద్ధీకరణ అనేది అవాంఛనీయ రసాయనాలు, జీవ కలుషితాలు వదిలేయబడిన ఘన పదార్థాలు, వాయువులను నీటి నుంచి తొలగించే ప్రక్రియ. నిర్దిష్ట ప్రయోజనాల కోసం నీటి సుద్ధతను ఉత్పత్తి చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. తాగునీటితో పాటు వైద్య, ఔషధ, రసాయన, పారిశ్రామిక అనువర్తనాలతో సహా పలు ఇతర ప్రయోజనాల కోసం నీటిని శుద్ధి చేస్తుంది. ప్రాజెక్ట్ వినియోగించే పద్ధతిలో వడపోత, అవక్షేపం, స్వేదనం వంటి భౌతిక ప్రక్రియలు అవలంబిస్తారు. అలాగే ఫ్లోక్యులేషన్, క్లోరినేషన్ వంటి రసాయన ప్రక్రియలు, అతినీల లోహిత కాంతి వంటి విద్యుదయస్కాంత వికిరణం వాడడం వంటివి చేపట్టి ఫిల్ట్రైజేషన్ చేయడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత.



అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్న రెండు దుకాణాల లైసెన్సులు రద్దు

సంగం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంగంలో అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్న రెండు దుకాణాలకు పది రోజుల పాటు లైసెన్సులను రద్దు చేసినట్లు ఏవో శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సంగం వచ్చిన జెడీ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయగా ఎంఆర్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు దుకాణాల లైసెన్సులను రద్దు చేసినట్లు తెలిపారు. అయితే రైతుల అవసరాల దృష్ట్యా ఆ రెండు దుకాణాలలోని యూరియాను స్వాధీనం చేసుకుని స్థానిక వ్యవసాయ సిబ్బందిచే ఎంఆర్పీ ధరకు విక్రయానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, సంగం, దువ్వూరు పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో ఉందని, యూరియా కావలసిన రైతులు పొలం వివరాలు అందచేసి వీఏఏల ద్వారా పర్మిట్లు రాయించుకుని యూరియా తీసుకెళ్లవచ్చునని తెలిపారు.

రీసర్వే డీటీల పునరుద్ధరణపై హర్షం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్న రీసర్వే డీటీలను పునరుద్ధ రిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం హర్షణీయమని ఏపీఆర్ ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కృషి చేశారని తెలిపారు.

నేడు ఎస్సీ వర్గీకరణ కమిషన్ సమావేశం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 3(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి కులగణన వివరాలు, అభ్యంతరాలను స్వీకరించటానికి రాజీవ్ రంజన్ మిశ్రా చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ సమావేశం శనివారం జరుగుతుందని సోషల్ వెల్ఫేర్ డీడీ కే శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్ట రేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో ఈ సమావేశం ఉం టుందని తెలిపారు. జిల్లాలోని ఎస్సీ పౌరులు, సంఘాల సభ్యు లు అభ్యంతరాలు ఏమైనా ఉంటే రాత పూర్వకంగా సమర్పించాలని కోరారు. కాగా, కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా శుక్రవారం సాయంత్రం నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయనకు నెల్లూరు ఆర్డీవో అనూష, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి స్వాగతం పలికారు.



ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాజీవ్ రంజన్ మిశ్రాకు స్వాగతం పలుకుతున్న సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి

రేపు వ్యవసాయ ఉద్యోగుల సంఘం సమావేశం

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం సమావేశం నెల్లూరులోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యంశాంతరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ శాఖలోని ప్రధాన సమస్యలపై చర్చించడంతోపాటు రాష్ట్ర నాయకుల సమక్షంలో జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక జరుగుతుందని, ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు.

కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం!

మనుబోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని జూనియర్ కళాశాలల్లోనూ అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నుంచి ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్నం భోజనం పెట్టనున్నారు. 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకానికి వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. తిరిగి ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో డొక్కా సీతమ్మ పేరుతో ఈ పథకాన్ని మళ్లీ పునరుద్ధరించి అమలు చేయనుంది. జిల్లావ్యాప్తంగా 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, 6,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ఈ పథకం కింద లబ్ధిపొందనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువమంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులే ఉంటారు. వీరంతా మండల కేంద్రాల్లో ఉండే కళాశాలలకు సమీప గ్రామాల్లోని ఇళ్ల నుంచి ఉదయం 7 గంటలకే బయలుదేరి కళాశాలలకు వస్తారు. మధ్యాహ్న భోజనానికి తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్ణయంతో అందరికీ ఊరట కలిగింది.

● **పాఠశాలల ఏజెన్సీలకే బాధ్యత**

ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న ఏజెన్సీలకే కళాశాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే బాధ్యతను విద్యాశాఖ అప్పగించింది. జిల్లాలోని మనుబోలు, వెంకటాచలంకు అక్షయ పాత్ర సంస్థ, నెల్లూరులోని డికేడబ్ల్యూ, కేఏసీ కళాశాలలకు ఇస్కాన్ సంస్థలకు ఈ పథకాన్ని అప్పగించగా, మిగిలిన 19 కళాశాలల్లో ఏజెన్సీల ద్వారానే భోజనం అందించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఖాకీ పరీక్షలకు సగం మందే!

(5వ పేజీ తరువాయి)

గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో నిరాశ చెందారు. ఇతర పనులు, వ్యాపారాలు, ఉద్యోగాల్లో ఇమిడి పోయారు. దీంతో ప్రస్తుత పరీక్షలపై ఆసక్తి చూపడం లేదు. కాగా, కానిస్టేబుల్ పోస్టుల భర్తీలో శుక్రవారం మహిళా అభ్యర్థులకు ప్రత్యేకం ఫిజికల్ టెస్ట్ నిర్వహించారు. 417 మందికి 226 మంది హాజరయ్యారు. వీరి కోసం ప్రత్యేకంగా మహిళా పోలీసు అధికారులు, మహిళ సిబ్బందిని ఏర్పాటు చేశారు. మహిళా అభ్యర్థులకు శనివారం కూడా దేహదారుఢ్య పరీక్షలు కొనసాగనున్నాయి.

పొగాకు సాగులోనూ డ్రోన్లు

- రైతులకు ఖర్చులు ఆదా
- సస్యరక్షణ చర్యల్లో రాయితీ



డ్రోన్ ద్వారా పొగాకు పురుగుమందు పిచికారీ



డ్రోన్‌లో ద్రావకం నింపుతున్న రైతు

కలిగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : పొగాకు మొక్క నాటడం నుంచి కాల్పు వరకు రైతు అన్నింటా కూలీలపైనే ఆధారపడాల్సి ఉంది. ఈ క్రమంలో ఎకరా పొగాకు సాగుచేయాలంటే రూ.లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. పొగాకు పనులకు దూరప్రాంతాల నుంచి కూలీలు వస్తారు. అయితే సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటే కూలీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ క్రమంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన డ్రోన్ల వినియోగం వాడుకలోకి వచ్చినప్పటికి ఈ విధానంలో ఖర్చు ఎక్కువ అవుతందనే కారణంతో రైతులు ముందుకు రాలేదు. గతేడాది కలిగిరి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో సుమారు 2300 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ విధానంలో సస్యరక్షణ చర్యలు చేపడితే, ఈఏడాదిలో ఇప్పటి వరకు 500ఎకరాల్లో మాత్రమే డ్రోన్ విధా నంలో సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లు బోర్డు అధికారులు తెలిపారు. పొగాకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టదలుచుకుంటే ముందుగా స్థానిక వేలం కేంద్రం వద్ద తాము సాగు చేస్తున్న పొలం వివరాలు నమోదు చేసుకుంటే, ఐటీసీ కంపెనీ ద్వారా రాయితీపై రైతులకు డ్రోన్ సౌకర్యం కల్పిస్తామని, ఈ విధానాన్ని రైతులు వినియోగించుకుని సాగు ఖర్చు తగ్గించుకోవాలని బోర్డు అధికారులు తెలియజేస్తున్నారు.

ఖర్చు తగ్గుతుంది...



డ్రోన్ ద్వారా సస్య రక్షణ చర్యలు చేపడితే ఎకరా పొగాకుకు రూ.500 ఖర్చు అవు తుంది. రైతు తన వాటాగా రూ.350 చెల్లిస్తే ఐటీసీ కంపెనీ రూ.150 చెల్లిస్తుంది. ఎకరాలో పురుగుమందు పిచికారీకి 5 నుంచి 10నిమిషాల సమయం పడుతుంది కావున ఖర్చు తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుంది.

- ప్రకాష్, ఐటీసీ కంపెనీ ప్రతినిధి

రైతులకు ఎంతో ఉపయోగకరం



డ్రోన్ ద్వారా రోజుకు 50 ఎకరాలకు పైగా సస్య రక్షణ చర్యలు చేపట్ట వచ్చు. డ్రోన్ విధానం చాలా సులభ తరం, రైతు లకు ఎంతో ఉపయోగకరం. కూలీల కొరతనే ఇబ్బందులు ఉండవు.

- భాస్కరుని సుధాకర్, పొగాకు రైతు

ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి


ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

బిట్రగుంట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన క్షేత్రంలోని ఆలయ పరిసరాలను పరిశీలించారు. అంతకు ముందు స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట ఈవో రాధాకృష్ణ, మాజీ ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రితో పాటు మండల సర్వేరు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, ముంతాల వెంకయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, ఆదిశేషయ్య, రామిరెడ్డి, వేంకటేశ్వర్లు, ప్రభాకర్ ఉన్నారు.

మెట్టకు మణిహారాలు ఈ రాజమార్గాలు

ముమ్మరంగా జాతీయ రహదారుల పనులు

● సీతారామపురానికి చుట్టూ మూడు హైవేలు


సీతారామపురం-ఉదయగిరి మార్గంలో జరుగుతున్న ఎన్‌హెచ్ 167-బీజీ జాతీయ రహదారి పనులు

సీతారామపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన సీతారామపురం మండలానికి ఎన్‌హెచ్ 167-బీజీ దుత్తలూరు- ఉదయగిరి, ప్రకాశం జిల్లా సింగరాయకొండ నుంచి సీతారామపురం మీదుగా కడప జిల్లా మైదుకూరు వరకు ఎన్‌హెచ్ 167-బీ, బెంగళూరు నుంచి విజయవాడ ఎన్‌హెచ్- 544 జి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారులు సీతారామపురం గ్రామానికి చుట్టూ మణిహారం లాగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దుత్తలూరు నుంచి ఉదయగిరి మీదుగా సీతారామపురం వరకు 36.4 కిలోమీటర్ల మేర రూ.310 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న జాతీయ రహదారి (167-బీజీ) పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 70శాతం పనులు పూర్తి చేశారు. పలుచోట్ల వంతెనల నిర్మాణం జరుగుతోంది. ఎన్‌హెచ్- 544 జి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు పూర్తయితే కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, బెంగళూరు, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు సులభతరవుతుంది. వ్యాపారాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. ఈ రహదారి నిర్మాణంతో మెట్ట భూముల ధరకు రెక్కలొచ్చాయి. గతంలో రహదారికి సమీపంలో ఉన్న ఎకరా భూమి రూ.5 లక్షల నుంచి రూ. 7 లక్షలు పలికేది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణంతో రూ.25 లక్షల నుంచి 30 లక్షలు పలుకుతోంది. సీతారామపురం రహదారి పక్కనే బారీ లేఅవుట్లు వేసి ప్లాట్ల విక్రయాలకు సైతం సిద్ధమవుతున్నాయి. ఏదిఏమైనా జాతీయ రహదారి నిర్మాణంతో మెట్ట ప్రాంత అభివృద్ధితో పాటు స్థానిక ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుంది.

న్యూస్ బాక్స్

ఉర్దూ పాఠశాలల తనిఖీ


విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలిస్తున్న ఖాజా మొహిద్దీన్

సంగం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జెండాదిబ్బ, దువ్వూరు, సంగంలోని ఉర్దూ పాఠశాలలను శుక్రవారం జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఖాజా మొహిద్దీన్ తనిఖీ చేశారు. జెండాదిబ్బలో ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతిరోజు యాప్‌లో విద్యార్థుల అటెండెన్స్ సకాలంలో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ తిరునాళ్ల

అల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బలిజపాలెంలో వెలసిన మహాలక్ష్మమ్మ తిరునాళ్లను శుక్రవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. గత ఇరవై ఏళ్లుగా నిలిపివేసిన తిరునాళ్ల తిరిగి ప్రారంభించి అమ్మవారికి ఉదయం పొంగళ్లు పొంగించి నైవేద్యాన్ని సమర్పించారు. ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు చేసి రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి ప్రత్యేక పూలతో విద్యుత్ దీపాలంకరణ శోభాయమానంగా తీర్చిదిదారు. గతంలో జరిగిఇన వివాదాల నేపథ్యంలో కావలి రూరల్ సీఐ పాపారావు ఆధ్వర్యంలో ఎస్ఐ కిషోర్‌బాబు సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వింజమూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘం (ఏబీఆర్ ఎస్ఎం) ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె మధుమూర్తి ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డిఎస్‌విఎస్ బాలసుబ్రహ్మణ్యం, డిగ్రీ కళాశాల విభాగం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ కె బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఎంసి చైర్మన్‌లకు శిక్షణ

సీతారామపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి సాధ్యమని మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి తెలిపారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్ఎంసి చైర్మన్‌లకు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ విధులు, బాధ్యతల గురించి ఆర్‌పిలు పిడతల సుధాకార్, కలివెల రవిచంద్ర వారికి వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, శిగే కొండయ్య, షేక్ షఫీ ,వి, అంజయ్య,సిఆర్ఎంటి లు పాల్గొన్నారు.


ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహన

కలిగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సిద్దనకొండూరులో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానవన జిల్లా అధికారి ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొని ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ, రాయితీతో డ్రిప్ పరికరాల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో 3ఎఫ్ కంపెనీ ఏజీఎం సూర్యనారాయణ, వింజమూరు ఉద్యాన అధికారి షేక్ షహీల్, వీహెచ్‌ఏ వెంకటరత్నం, 3ఎఫ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ సాయిరాం, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం

కందుకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోతురాజుమిట్ట సెంటర్‌లోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి వీపీజీ జ్యూయలర్స్ అధినేత వేముల సుకుమార్ గుప్తా శుక్రవారం ఆర్యవైశ్య యువకులకు రూ.4,11,116లను అందజేశారు. ఈ నగదుతో శ్మశానవాటికలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేముల తిరుమలరావు, పార్థు, ఆర్యవైశ్యనాయకులు మురారిశెట్టి సుధీర్ కుమార్, గుర్రం అల్లూరయ్య, బొగ్గవరపు బాలనరసింహ పాల్గొన్నారు.

కావలి నుంచి జొన్నవాడకు ఆర్టీసీ బస్సు ప్రారంభం


జొన్నవాడ బస్సును ప్రారంభిస్తున్న భక్తురాలు లక్ష్మీసంపూర్ణమ్మ

కావలి టౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కావలి నుంచి జొన్నవాడకు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును శుక్రవారం డిపో మేనేజర్ రాహూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జొన్నవాడ కామాక్షితాయి భక్తురాలు ద్రోణా దుల లక్ష్మీసంపూర్ణమ్మ ప్రారంభించారు. ప్రతి శుక్రవారం భక్తుల విన్నపం మేరకు తిరిగి సర్వీసును ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కల్పన, కార్యాలయ మేనేజర్ విజయకుమారి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, బస్టాండ్ మేనేజర్ రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్, బీసీ భవన్ అధ్యక్ష కార్యదర్శులు అద్దంకి ప్రభాకర్, చిన్ని వరప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

కావలి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక వైద్యశాలలో శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించారు. కొంతకాలంగా పేరుకుపోయిన సమస్యలపై అధికారులతో చర్చించారు. ఆసుపత్రిలో తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా సమస్యలను అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదని కాంట్రాక్టర్ అసంపూర్తిగా భవన నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఆసుపత్రి షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగించుకునే వారు సక్రమంగా అద్దెలు చెల్లించలేదని వాపోయారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల, అభివృద్ధి కమిటీ సభ్యులు చవల రామక్రిష్ణ, ఏటూరి శివ, పొబ్బా సాయి, ఆత్మకూరి నాగలక్ష్మీ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుచేస్తా : కాకర్ల

వింజమూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. శుక్రవారం వింజమూరు ఆటోమొబైల్స్ డీలర్స్ టెక్నికల్ వర్క్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకినపల్లి రఘురామిరెడ్డి, సెక్రటరీ గువ్వల రవీంద్రారెడ్డి, కార్యదర్శులు కదిరి రంగారావు, మహేంద్ర ట్రెజరీ బ్రహ్మయ్య, తదితరులు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాటా్లడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి త్వరలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తామన్నారు.

గండిపాళెంలో రెవెన్యూ సదస్సు

ఉదయగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో శుక్రవారం తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో ప్రజలు, రైతులు పలు సమస్యలపై అర్జీలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ జహీర్, ఆర్ఐ సురేంద్ర, వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, సర్వేయరు శ్రీకాంత్ పాల్గొన్నారు.

● దుత్తలూరు : మండలంలోని తెడ్డుపాడు గ్రామంలో శుక్రవారం తహసీల్దారు వై నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు సమస్యలపై అర్జీలు అందజేశారు.

వైద్యాధికారులకు సత్కారం

అనంతసాగరం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యశాఖాధికారి సుజాత, ఉప వైద్యాధికారి ఖాదర్‌వలిని శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, అనంతసాగరం పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ షేక్ మీరాన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరాజు, రెడ్డప్ప, నరేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సంగం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంగం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, కమ్యూనిటీ హెల్త్ అధికారి ఇందిర పాల్గొన్నారు.


ఉదయగిరి:: సావిత్రిబాయిపూలేకు నివాళులర్పిస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు


ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయబృందం

సాయిత్రీబాయి పూలే సేవలు మహిళలకు ఆదర్శం

ఆత్మకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తొలి భారతీయ ఉపాధ్యాయురాలు సాయిత్రీబాయి పూలే సేవలు మహిళలకు ఆదర్శమని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనంత లక్ష్మీ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఎల్ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్ర వారం సాయిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయిత్రీబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అనంతసాగరం : కామిరెడ్డిపాడు, చిలకలమర్రి ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం ఉపాధ్యా యులను సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు వసుంధరాదేవి, సురేష్ పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం సావిత్రిబాయిపూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం ఉపాధ్యాయినులు రుక్సానాబేగం, శైలజా, భార్గవిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

● చేజర్ల : మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఆదురుపల్లి ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు ఎస్ఆర్ఐ గణపతిరెడ్డి, చెంచురత్నం జ్ఞాపకార్థం మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎన్ రమణయ్య, సుబ్రమణ్యం, ఎమ్ రవిబాబు పాల్గొన్నారు.

● ఉదయగిరి: బిజ్జంపల్లి గ్రామంలో శుక్రవారం మండల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు నాయబ్‌రసూల్, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఆవాజ్ కమిటీ సభ్యులు అన్వర్, ఫరీద్‌బాషా, బాలకృష్ణ, ఫరీద్, నారాయణ పాల్గొన్నారు.

● సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో మస్తాన్‌వలి ముఖ్య అతిథిగా హాజరై సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంగయ్య, సుధాకరయ్య, బాష, జయరామిరెడ్డి, వాణి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలకొండలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయినులు ఏ సుభాషిణి, పి సీతా మహాలక్ష్మీ, షేక్ షమీలాబేగంలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి సురేష్, లక్ష్మయ్య, మహేష్, శ్రీరాములు, పాల్గొన్నారు.

● కావలి టౌన్: ఎంఈవో గోవిందయ్య ముసునూరులోని గిరిజన బాలికల వసతిగృహ పాఠశాలను సందర్శించారు. సావిత్రబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

●కొండాపురం : సమాజంలో అణగారిన మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి మరువలేనిదని మండల విద్యాధికారులు -1, 2లు కె.రవికుమార్, ఆనందరావులు తెలిపారు. మండల విద్యావనరులకేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

● బిట్రగుంట: కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు అపోలో ఆస్పత్రి వైద్యురాలు స్రవంతిని కళాశాల మహిళ అధ్యాపకులు సన్మా నించారు. ఏనుగులబావి ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. విశ్వనాథరావుపేట బాలికల ఉన్నత పాఠశాలలో అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపకురాలు జీ.బాలశైలజ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

● కందుకూరు: స్థానిక బీటీఏ కార్యాలయంలో బీటీఏ కందుకూరు డివిజన్ నాయకులు కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కళ్లగుంట మోహనరావులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కళ్లగుంట మోహనరావు, కసుకుర్తి అంజయ్య, వలేటి మాలకొండయ్య, ధన్యాసి కోటేశ్వరరావ పాల్గొన్నారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాజగోపాలబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీని వాసరావు, షేక్ షహనాజ్‌బేగం, నరేష్‌రాజా, పద్మావతి, కరుణ రత్నకుమార్, బాలూ నాయక్ పాల్గొన్నారు. అలాగే న్యాయవాది ముప్పవరపు కిషోర్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

● లింగసముద్రం: పెంట్రాల యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు హైమారాణి, సంధ్యారాణి, విద్యార్థి తల్లి మాధురిలను సన్మానిం చారు.

● ఉలవపాడు: ప్రాథమిక పాఠశాలలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అంజమ్మ, కామేశ్వరి, కార్యకర్త ఇందిరమ్మ, మాజీ సర్పంచులు గురజాల ప్రసాదరావు, దార్ల కోటేశ్వరరావు, ఉపాధ్యాయుడు బాబ్జీ, పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి గౌరవ సత్కారం చేశారు.


కావలి టౌన్: సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న ఎంఈవో గోవిందయ్య


సీతారామపురం : టీచర్లను సత్కరిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి



కందుకూరులో బీటీఏ నాయకులు

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రాజా డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సంఘం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ పాల్గొని సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈనెల 21న నెల్లూరులో నిర్వహిస్తున్న రవాణారంగ కార్మికుల సదస్సుకు డివిజన్ నుంచి అధికసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరసింహ, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా చెంచురామయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్కే బాజీ, కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా ప్రతాప్, మహేష్‌లను ఎన్నుకున్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

ఆత్మకూరు ,జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రిమూరి మృతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ శుక్రవారం ఆత్మకూరు న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్, న్యాయవాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది శేషాద్రిమూరి మృతికి కారణమైన త్రీటౌన్ సీఐ శాంతిలాల్‌ను వెంటనే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ కేసుల్లో జోక్యం చేసుకోవద్దన్న సుప్రీంకోర్టు ఆదేశాలను సీఐ శాంతిలాల్ ఖాతరు చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగం రైతులకు లాభదాయకం


డ్రోన్‌తో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు

కలువాయి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ వినియోగం రైతులకు లాభదాయకం అని వ్యవసాయాధికారి వీ ప్రతాప్ పేర్కొన్నారు. మండలంలోని లలితానగర్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాగులో ఉన్న వరి పైరుపై కీటక నాశిని పురుగుమందును డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. గ్రామానికి చెందిన రామ్మోహన్‌రావు, హజరత్తయ్య పొలాల్లో ప్రయోగాత్మకంగా డ్రోన్ ద్వారా 10లీటర్ల పురుగు మందును కేవలం 7 నిమిషాల్లోనే ఎకరాలో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వీ ప్రతాప్ మాట్లాడుతూ కూలీల సమస్యను అధిగమించడంతో పాటు రైతులకు డబ్బు కూడా ఆదా అవుతుందన్నారు. ఎకరాకు రూ.300 తీసుకుంటునట్లు, 80శాతం రాయితీతో మండలానికి ఒకటి చొప్పున రైతు గ్రూపులకు ప్రభుత్వం డ్రోన్లు అందజేయాలని నిర్ణయించి నట్లు ఆయన తెలిపారు. డ్రోన్ స్ప్రేలో 20శాతం నానో యూరియా కూడా కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వసతిగృహాల మరమ్మతులకు నిధులు మంజూరు

మర్రిపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వసతిగృహాల మరమ్మతుల కోసం రూ. 8కోట్లు మంజూరైనట్లు వన్ మ్యాన్ కమిషన్ చెర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతిగృహాలను శుక్రవారం ఆయన సందర్శించారు. వసతులపై ఏఎస్‌డబ్ల్యూ, వార్డెన్‌లతో ఆరాతీశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట జిల్లా లైజినింగ్ అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

సంగం పీఏసీఎస్ తనిఖీ

సంగం, జవవరి 3 (ఆంధ్రజ్యోతి): సంగంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని జిల్లా సహకార సంఘం డీసీవో గుర్రప్ప శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీలో నిల్వ ఉన్న యూరియా, స్టాక్ వివరాలు తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోలు బంకు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సొసైటీ సెక్రటరీ దస్తగిరి, సిబ్బంది బాలకృష్ణ ఉన్నారు.

జాబ్‌మేళాలో 13 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఉదయగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 13 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రీన్‌టెక్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి అబ్దుల్‌ఖయ్యూం, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, అధ్యాపకులు అక్మల్, విశ్వరూపాచారి తదితరులు పాల్గొన్నారు.

వెంగళాపురంలో పారిశుధ్య పనులు చేపట్టండి

లింగసముద్రం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వెంగళాపురం గ్రామాన్ని శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్, సీహెచ్‌ఓ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి సందర్శించారు. గ్రామంలోని మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉంటున్నట్లు, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉన్నట్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. రెండు రోజుల్లో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని సర్పంచు మల్లికార్జున, కార్యదర్శి సాయికిరణ్‌కు సూచించారు. అలాగే మురుగు కాలువల్లో ఎబేట్ మందు స్ప్రే చేయించాలని ఆరోగ్యశాఖ అధికారులకు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది డాక్టర్ రమేష్ ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది స్వాతి, ఆశావర్కరు వెంకటరమణ ఉన్నారు.